ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

ఏలూరు
జిల్లా వార్తలు
5
ఆదివారం 14 సెప్టెంబరు 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 25.0

ఒకేసారి 4 ఉద్యోగాలు

చదువున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఓ కల. ఇందుకోసం ప్రయత్నం చేస్తూనే వుంటారు. కాని, సుదీర్ఘమైన ప్రణాళిక, క్రమశిక్షణ, పట్టుదల ముఖ్యం. ఇవి ఉన్నవారే తమ లక్ష్యాన్ని సాధిస్తారు. కొందరు ఏదైనా ఒక ఉద్యోగం వస్తే చాలనుకుంటారు. అందుకు ఎంతో కష్టపడతారు. కాని, ఒకే ఏడాది నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించారు.. తణుకు మునిసిపల్ కమిషనర్ త్రిపర్ణ రాజ్‌కుమార్. ఇది ఎలా సాధ్యమైంది ? ఆయన విజయం సాధించేందుకు పడిన తపన, కృషి ఎలాంటివి ? మొదలైన అంశాలపై ఆంధ్రజ్యోతి సండే స్పెషల్.. ఆయన మాటల్లోనే..

- ఎన్ని గంటలు చదివామన్నది ముఖ్యం కాదు.. ఎంత మేర దృష్టి పెట్టామన్నదే కీలకం..
- ఏలూరు గ్రంథాలయమే నా కోచింగ్ సెంటర్.. సెల్‌ఫోన్‌కు దూరంగా.. ఏడేళ్లు
- గ్రూప్ 2 పరీక్ష పేపరు చూడగానే జాబ్ గ్యారెంటీ అని తెలిసిపోయింది
- ఆంధ్రజ్యోతితో తణుకు మునిసిపల్ కమిషనర్ రాజ్‌కుమార్ ముచ్చట్లు

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్



కుటుంబ నేపథ్యం..

- మాది ఏలూరు. అమ్మ సత్యవతి గృహిణి. నాన్న వెంకటరమణ గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేసి 2009లో రిటైర్ అయ్యారు. మేం నలుగురు అన్నదమ్ములం. అందరిలోకి నేనే చిన్నవాడిని. అన్నయ్యలు రమేష్ కరోనా సమయంలో చనిపోయారు. రాజేష్, బుచ్చిబాబు ఏలూరులో వ్యాపారం చేస్తున్నారు. ప్రాథమిక విద్య ఏలూరు ప్రభుత్వ పాఠశాలలోనే జరిగింది. ఇంటర్ చైతన్యలో, బీటెక్ తణుకు ఏఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చదివా. భార్య సూర్యప్రశాంతి, కుమార్తె ఐసాని సత్య, కుమారుడు ఈసాన్ వెంకటకార్తికేయ.

సెల్‌ఫోన్‌కు దూరంగా..

- నేను కాలేజి చదివే సమయంలో ఓ రోజు మా ఫ్రెండ్ బైక్‌పై వెళుతున్నాడు. అతని పేరు మర్చిపోయి ఒరే.. ఒరే అని పిలిచినా పలకలేదు. పేరు మర్చిపోయాననే బాధతో సెల్‌ఫోన్‌తో ఎక్కువగా వాడడం వల్లేనని అర్థమైంది. అంతే ఏడేళ్లపాటు ఫోన్ దూరం పెట్టా.
- ప్రతి ఒక్కరికి ఉద్యోగాలు వస్తాయి. ఇందులో తెలివైన వారు, తెలివి లేని వారనేది ఉండదు. ప్రతి ఒక్కరు వారి లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి అంతే..!

పోటీ పరీక్షలకు ప్రిపరేషన్..

- బీటెక్ తర్వాత పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ మొదలు పెట్టా. హైదరాబాద్ ఆర్.సి.రెడ్డి అకాడమీలో 2010-11ల్లో సివిల్స్ కోచింగ్ తీసుకున్నా. కాని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదు. తర్వాత ఇంటి వద్ద, లైబ్రరీలో పుస్తకాలు చదువుతూ గ్రూపు-2 పరీక్షకు ప్రిపేర్ అయ్యా. నోటిఫికేషన్‌కే ఆరేళ్ల సమయం పట్టింది. అయినా పట్టువదలకుండా నిరంతరం సబ్జెక్టు, దీని రిలేటెడ్ పుస్తకాలు వెయ్యి వరకు చదివాను. ప్రతి పుస్తకంలో తెలుసుకున్న కొత్త విషయాలను నోట్స్ రాసుకుంటూ ఉండేవాడిని.

ఒకే ఏడాది నాలుగు ఉద్యోగాలు

- ఈ క్రమంలో ఎన్నో ఉద్యోగాలకు పోటీ పరీక్షలు రాశా. చివరకు కల ఫలించింది. 2017-18లో ఒకే సారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. వాటిలో రైల్వేస్టేషన్ మాస్టారు, ఎస్ఎస్‌సీ క్లర్క్, పంచాయతీ కార్యదర్శితోపాటు గ్రూపు-2లో 11వ ర్యాంకు సాధించి, ఓపెన్ కేటగిరీలో మొదటి నలుగురిలో ఒకరిగా నిలిచా. నా ఆనందానికి హద్దుల్లేవు. అన్ని ఉద్యోగాలలో ప్రజలతో నేరుగా సంబంధాలు వుండే మునిసిపల్ కమిషనర్‌పైనే ఆసక్తి చూపించా. తొలి పోస్టింగ్ 2018లో కృష్ణా జిల్లా ఉయ్యూరు మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టా. తర్వాత మండపేట, ప్రస్తుతం తణుకు మునిసిపల్ కమిషనర్‌గా కొనసాగుతున్నా.

ఎన్ని గంటలు చదివామన్నది కాదు..

- నాతోపాటు రోజూ లైబ్రరీలో 150 మంది వరకు చదివేవారు. వాళ్లలో నాతోపాటు మరొకరు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికయ్యారు. పోటీ పరీక్షలు రాసే ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సింది ఎన్ని గంటలు చదివామన్నది ముఖ్యం కాదు. చదివే సమయంలో ఏ మేర దృష్టి పెట్టామన్నదే కీలకం. చాలామంది గ్యాప్ లేకుండా గంటల తరబడి చదువుతారు. నేను రెండు గంటలు చదివి.. తర్వాత అరగంట, గంట గ్యాప్ ఇచ్చేవాడిని. ఇలా చదివినప్పుడు మెదడు రిలాక్స్ అవుతుంది. చదివిన విషయం గుర్తుంటుంది. కష్టపడి చదవడం కాదు.. ఇష్టపడి చదవాలి.

అదీ నా కాన్ఫిడెంట్

- పోటీ పరీక్షలు రాసే వారికి కాన్ఫిడెంట్‌ను బట్టి ఉద్యోగం వచ్చేస్తుందనే సంకేతాలు ముందే అందుతాయి. నా విషయంలోనూ ఇది జరిగింది. గ్రూపు-2 పరీక్ష పేపరు చూసినపుడు చాలా కాన్ఫిడెంట్ వచ్చింది. అందరూ ఓఎంఆర్ షీట్‌లో బబుల్స్ పెడుతున్నారు. నేను ఖాళీగా కూర్చున్నా. చివరి అర గంటలో పెట్టవచ్చనే ధీమా. ఈలోగా పరీక్ష కేంద్రానికి వచ్చిన స్క్వాడ్ నా పేపరు చూసి ఏమీ రాయలేదని అదోలా చూశారు. కాని, చివరకు ఏడు లక్షల మంది రాసిన ఈ పరీక్షల్లో ఓపెన్ క్యాటగిరీలో ఎంపికైన మొదటి నలుగురు అభ్యర్థుల్లో నేను ఒకడిగా నిలిచా.

- తణుకు, ఆంధ్రజ్యోతి



పోతనపల్లి ఫారెస్ట్‌లో మోహరించిన ఫారెస్ట్, పోలీస్ సిబ్బంది

పోతనపల్లి ఫారెస్ట్‌లో ఉద్రిక్తత

- అటవీ భూముల ఆక్రమణకు గిరిజనులు, దళితుల యత్నం
- అడ్డుకున్న ఫారెస్ట్, పోలీస్ సిబ్బంది

చాట్రాయి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లిలో శనివారం అటవీ భూముల ఆక్రమణకు ఆగ్రామ గిరిజనులు, దళితులు ప్రయత్నించగా నూజివీడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి.సత్యనారాయణ ఆధ్వర్యంలో అటవీ, పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ సందర్భంగా గిరిజనులు, దళితులు మాట్లాడుతూ తమ్మిలేరు ప్రాజెక్టు నిర్మాణంలో తమ ఊరుతో పాటు, భూములు మొత్తం ముంపులో పోయాయని, నామమాత్రం నష్ట పరిహారం ఇచ్చి చేతులు దులుపుకున్నారని, భూముల కింద భూములు, పునరావాసం అమలు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవనోపాధి కోసం మనిషికి అర ఎకరం చొప్పున అటవీ భూమి సాగు చేసుకుంటామని అనుమతించాలని కోరారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఫారెస్ట్ భూమి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉందని, అక్రమణలకు అనుమతించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. వన సంరక్షణ సమితి ఏర్పాటు చేసి అటవీ ఉత్పత్తుల ద్వారా జీవనోపాధి కల్పించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్
3,281 కేసులు రాజీ

లోపలి పేజీలో..



నేవీ ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఎం, గిరిజన సంఘాల నాయకులు

నేవీ ఆయుధ డిపోతో ఉనికిని కోల్పోతాం

- గిరిజన సంఘాలు వెల్లడి

జీలుగుమిల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే పలుసార్లు నేవీ ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకించామని మరలా ఈ విషయం తెరపైకి తేవటం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. జీలుగుమిల్లిలో సీపీఎం, ఏపీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుతో గిరిజనులు సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగవుతాయని, గిరిజనులు తమ ఉనికిని కోల్పోతారన్నారు. నేవీ ఆయుధ డిపో ఏర్పాటు గిరిజన చట్టాలకు అన్యాయం చేయడమేనని సీపీఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు అన్నారు. ప్రజా ప్రతినిధులు తక్షణమే తమ నిర్ణయం మార్చుకోవాలని లేకుంటే ఆందోళనలు చేపడతా మన్నారు. టి.రామకృష్ణ, టి.సంకురుడు, సీహెచ్.సీతారామయ్య, కె.దుర్గమ్మ, భోడమ్మ ఉన్నారు.

అపోహలు వీడండి.. జనవరిలో శంకుస్థాపన : ఎమ్మెల్యే

వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో నిర్మించే నేవీ ఆయుధ డిపో ఏర్పాటు విషయమై ప్రజలు అపోహలు వీడాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. 1129 ఎకరాల భూ సేకరణలో 33 ఎకరాల్లో మాత్రమే నేవీ ఆయుధ డిపోకు సంబంధించిన నిర్మాణం జరుగుతుందన్నారు. మిగిలిన భూమిలో సంబంధిత ఉద్యోగులు, పాఠశాలలు, ఆస్పత్రుల ఏర్పాటు ఉంటుందన్నారు. 37 కుటుంబాలకు పూర్తి పరిహారం చెల్లించిన అనంతరమే భూమిని ఖాళీ చెయ్యాల్సి ఉంటుందన్నారు. జనవరిలో ప్రాజెక్టు ఏర్పాటు కోసం శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఆయా విషయాలపై ఇటీవల ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ట్రైకార్ రాష్ట్ర చైర్మన్ బొరగం శ్రీనివాస్ కలెక్టరు వెట్రిసెల్వీ ఆధ్వర్యంలో నేవీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో చర్చించామన్నారు.

కైకలూరు పంచాయతీలో అవినీతి వ్యవహారం..

ఆరుగురి సస్పెన్షన్..!

- సస్పెన్షన్ ఆర్డరు బయటకు రాకుండా గోప్యత

కైకలూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి):కైకలూరు పంచాయతీలో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం అయినట్టు వచ్చిన ఫిర్యాదులతో జిల్లాస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టగా గతంలో ఇక్కడ పనిచేసిన ఆరుగురు పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు పడినట్టు సమాచారం. అయితే సస్పెన్షన్ ఆర్డర్‌ను ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచ డం గమనార్హం. కైకలూరు సర్పంచ్‌గా దానం మేరీ నవరత్నకుమారి పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 2024 వరకు జరిగిన పరిపాలనపై అనేక ఫిర్యాదులు వెళ్లాయి. జంగారెడ్డిగూడెం డీఎల్పీవో పూర్తిస్థాయిలో విచారణ చేసి రూ.8,08,58,863లు అవినీతికి జరిగినట్టు నిర్ధారించారు. ఇందులో సర్పంచ్ రూ.4,04,29,431లు అవినీతికి పాల్పడినట్టు, ఆ సమయంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శులు దూలం లక్ష్మీనారాయణ, కేఎస్ఎస్ రామలక్ష్మి, కేశిరెడ్డి శ్రీనివాసరావు, కె.శివన్నారాయణ, ఆదిరాజు వెంకటేశ్వరరావుతో పాటు కొంతకాలం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా వ్యవహరించిన కైకలూరు మండల పంచాయతీల విస్తరణల అధికారి వి.రవిశంకరరావు కలిపి మొత్తం రూ.4,04,29,432లు అవినీతికి పాల్పడినట్టు నిర్ధారించారు. మరో పంచాయతీ కార్యదర్శి తన కాలంలో నిధులను (మిగతా 8వ పేజీలో)

కుండపోత


- జిల్లాలో భారీవర్షాలు.. స్తంభించిన జనజీవనం
- ఏజెన్సీలో పొంగిన వాగులు
- గుబ్బల మంగమ్మతల్లి ఆలయం వద్ద చిక్కుకున్న భక్తులు
- తమ్మిలేరు, ఎర్రకాలువకు వరదపోటు
- పెరుగుతున్న గోదావరి.. భయపెడుతున్న పెదవాగు
- నిండిన చెరువులు.. మెట్ట రైతుల్లో హర్షం



గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ఏలూరుసిటీ/బుట్టాయగూడెం/పోలవరం/లింగపాలెం/చింతలపూడి/ముసునూరు/కామవరపుకోట/పెదపాడు/ఆగిరిపల్లి/పెదవేగి,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో శుక్రవారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. దీనిపై ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈ కారణంగా జిల్లాలో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. జనజీవనం స్థంభించింది. రానున్న రెండు రోజుల్లో కోస్తా జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఏలూరు నగరంలో శనివారం కుండపోతగా కురిసిన వర్షంతో పవర్‌పేట ప్రాంతంలో రోడ్లపై ఉధృతంగా నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు మెట్ట ప్రాంతాల్లోని చెరువుల్లో నీరు చేరడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఏజెన్సీ అటవీ ప్రాంతంలోని కొండవాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. బుట్టాయగూడెం మండలం కామవరంలో వర్షపునీరు ఇళ్లలోకి చేరింది. గుబ్బల మంగమ్మతల్లి ఆలయం వద్ద ఉన్న ఎదురెక్కుడు కొండవాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. అమ్మవారి దర్శనానికి వెళ్లిన భక్తులు, వ్యాపారులు వాగుకు అవతలి వైపునే చిక్కుకుపోయారు. వారిని తీసుకు రావడానికి ఆలయ కమిటీవారు ఏర్పాట్లు చేస్తున్నారు. రెడ్డిగణపవరం జల్లేరు కొండవాగు, వీరన్నపాలెం కొండవాగు, విప్పలపాడు వద్ద కొండవాగు, బైనేరు వాగు, కెఆర్ పురం తూర్పు కాలువ వాగు పొంగి ప్రవహిస్తున్నాయి. పోలవరం మండలంలో జిల్లెళ్లగూడెం, గుంజవరం, కొవ్వాడ కాలువ కొండవాగులు పొంగి ప్రవహించాయి. కొండవాగుల జలాలు కొవ్వాడ కాలువ అవుట్ (మిగతా 8వ పేజీలో)

- గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా ద్వారకాతిరుమల మండలంలో 76.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 12.9 మి.మీ నమోదైంది. ఉంగుటూరు 35.4, కొయ్యలగూడెం 34.8, కలిదిండి 32.2, పోలవరం 24, పెదవేగి 22.4, భీమడోలు 16.4, కామవరపుకోట 13.6, జంగారెడ్డిగూడెం 12.4, కుక్కునూరు 12.2, పెదపాడు 11.8, దెందులూరు 9.6, నిడమర్రు 7.8, మండవల్లి 7.6, కైకలూరు 6.2, బుట్టాయిగూడెం 6, చింతలపూడి 5, వేలేరుపాడు 4.6, లింగపాలెం 4.4, ఏలూరు అర్బన్ 4.2, ఏలూరు రూరల్ 3.6, ఆగిరిపల్లి 3.6, టి.నరసాపురం 2.4, ముదినేపల్లి 1.8, నూజివీడు 1.2 జీలుగుమిల్లి 0.8 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.



ఏలూరులో కురుస్తున్న భారీవర్షం

పెదవాగుకు వరద ముంపు



ఉధృతంగా ప్రవహిస్తున్న పెదవాగు

వేలేరుపాడు/ఏలూరు/ఏలూరుసిటీ :పెదవాగు ప్రాజెక్టు ఎగువ భాగాన, వేలేరుపాడు మండలంలో శనివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షాల కారణంగా పెదవాగుకు వరద పోటెత్తుతోంది. గతేడాది ఇదే తరహాలో పెదవాగు ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో ప్రాజెక్టుకు గండిపడి భారీగా ఆస్తి నష్టం కలిగించింది. అప్పటి పెదవాగు సృష్టించిన విధ్వంసంతో కకావికలమైన ప్రజలు పూర్తిగా మరచిపోక ముందే మరోసారి పెదవాగు ప్రాజెక్టుకు భారీగా వరద చేరుకుంటోంది. ప్రాజెక్టు మూడు గేట్లను పూర్తిగా ఎత్తేశారు. మరోవైపు ప్రాజెక్టు దిగువన ఉన్న పదిగ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

పెదవాగు వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముంపునకు గురయ్యే దిగువ ప్రాంత ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి శనివారం ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. పెదవాగు ప్రాజెక్టు నీటిమట్టం 77.43 అడుగులకు చేరుకుందన్నారు. పెదవాగు రిజర్వాయర్ నుంచి ఇప్పటికే 10వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారని, ఆదివారానికి ఇది మరింత పెరగవచ్చన్నారు.వేలేరుపాడు మండలంలోని కుమ్మరిగూడెం, గొల్లగూడెం, వసంతవాడ, గుండం బోరు, మద్దికొండ, లచ్చిగూడెం, రుద్రంకోట, అల్లూరి నగరం, కోయ మాదారం, రామవరం, గొల్లవాయి, రెడ్డిగూడెం, బండ్లపూర్, భూదేవి పేట, శివకాశీపురం , వేలేరుపాడు మొత్తం 17 నివాసిత ప్రాంతాలకు వరద రావచ్చని, ఆయా ప్రాంత ప్రజలందరూ సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని కోరారు.

కంట్రోల్‌రూమ్స్ ఏర్పాటు

ఏలూరు కలెక్టరేట్‌లో 1800-233-1077, 94910 41419, ఫోన్ నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో 83092 69056 నెంబర్‌తో, వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో 83286 96546 నెంబర్‌తో, కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో 80962 74662 నంబర్‌తో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశామన్నారు. బోట్లు , గజ ఈతగాళ్లను సిద్ధం చేశామని, రాష్ట్ర విపత్తు నివారణ దళంను సిద్ధం చేశామని తెలిపారు.



నీటమునిగిన గుండేటివాగు లోలెవెల్ కాజ్‌వే

పెరుగుతున్న గోదావరి

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం: భారీవర్షాల కారణంగా గోదావరి నీటిమట్టం మరలా పెరుగుతోంది. శనివారం సాయంత్రానికి భద్రాచలం వద్ద 33.10 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఈ క్రమంలో కుక్కునూరు, దాచారం గ్రామాల మధ్య ఉన్న గుండేటివాగు లోలెవిల్‌కాజ్‌వే నీటమునిగింది. దాచారం, గొమ్ముగూడెం, వేలేరుపాడు వెళ్లే ప్రజలు వయా నల్లకుంట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. వేలేరుపాడు మండలంలోని ఎద్దువాగు వంతెన మరలా నీటమునిగిపోవడంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఒకవైపు గోదావరి పోటెత్తి ఉండడం మరో వైపు పెదవాగు ఉగ్రరూపం దాల్చడంతో మండల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పోలవరం వద్ద గోదావరి నీటి మట్టం పెరిగింది. పట్టిసీమ శివక్షేత్రం వద్ద వరద జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

వాగులో కొట్టుకుపోయిన
ఇద్దరు మహిళా కూలీలు



చెన్నమ్మ



వరలక్ష్మి

జీలుగుమిల్లి/ఏలూరు క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోజువారీ కూలిపనుల కోసం పక్క రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న పొలాలకు వెళ్లి పనులు ముగించుకుని తిరిగి వస్తున్న ఇద్దరు మహిళా కూలీలు వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తూ కొట్టుకుపోయారు. వారి కోసం గాలింపు చేపట్టారు. జీలుగుమిల్లి మండలం పూచికపాడుకు చెందిన పచ్చిపాల వరలక్ష్మి (50)కు భర్త వెంకటేశ్వరరావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడికి వివాహం జరగ్గా మరో కుమారుడికి వివాహం చేయాల్సి ఉంది. అదే గ్రామానికి చెందిన పాలడుగుల చెన్నమ్మ (50) భర్త గతంలోనే మరణించాడు. ఆమెకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. వీరందరికి వివాహం అయింది. ప్రతి రోజువారీ పూచికపాడుకు పది కిలోమీటర్లలో దూరంలో ఉన్న తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండ లం చెన్నాపురంలోని పామాయిల్ తోటలో కూలిపనులకు వెళ్లి వస్తూ ఉంటారు. శనివారం వారితోపాటు మరో ఐదుగురు యథావిధిగా పను లకు వెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో తెలంగాణలోని అనంతారం కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండగా దానిని దాటే ప్రయత్నం చేస్తూ వరలక్ష్మి, చెన్నమ్మ నీటిలో కొట్టుకుపోయారు. మిగిలిన కూలీలు కుటుంబ సభ్యులకు, అధికారులకు సమాచారమిచ్చారు. జీలుగుమిల్లి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లే ప్రయత్నం చేశారు. అయితే రాచన్నగూడెం సమీప చిన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడతో సీఐ వెంకటేశ్వరావు, ఎస్ఐ కాంత్రి కుమార్ సిబ్బందితో అక్కడే ఆగి పోవాల్సి వచ్చింది. గల్లంతైన వారి కోసం అటు తెలంగాణ పోలీసులు ఇటు పూచికపాడు గ్రామస్థులు గాలించేందుకు ప్రయత్నించారు. పొద్దుపోయే వరకు వారి ఆచూకీ తెలియలేదు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల్ని సిద్ధం చేసినట్టు, జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్టు సీఐ వెంకటేశ్వరరావు చెప్పారు.



చిన్నవాగు దాటేందుకు వీలు లేక అక్కడే వేచిఉన్న సీఐ, ఎస్ఐ

నూజివీడు ఎన్టీఆర్.. కైకలూరు కృష్ణా జిల్లాల్లోకి..

- మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రజల సెంటిమెంట్‌లను దృష్టిలో పెట్టుకుని నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో, కైకలూరును కృష్ణా జిల్లాలో విలీనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘానికి నివేదికలు అందించామని, త్వరలో ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నూజివీడులోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ' గత వైసీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా జిల్లాల విభజన చేపట్టింది. స్థానిక సెంటిమెంట్‌లను పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో జిల్లాల పునర్‌వ్యవస్థీకరణకు చర్యలు చేపడుతున్నాం. గత ప్రభుత్వం సీఎం రిలీఫ్‌ఫండ్‌ను తుంగలో తొక్కితే కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా వేలాది కోట్లు ఖర్చు చేస్తోంది. ఒక్క నూజివీడు నియోజకవర్గానికే రూ.6కోట్లు సీఎం రిలీఫ్‌ఫండ్ కింద మంజూరు అయ్యాయన్నారు. నూజివీడులో రూ.ఐదు కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. రాష్ట్రంలో యూరియా కొరత లేకపోయినా ఉన్నట్లు వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది. నూజివీడు మామిడి రైతులకు ఏమి చేయలేదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అనడం విడ్డూరంగా ఉంది. చిత్తూరులో మనకన్నా రెండునెలలు ఆలస్యంగా పంట దిగుబడి వస్తుంది.. అది తెలియని ప్రతాప్ ఎలా నాయకుడు అయ్యారో తెలియడం లేదు' అంటూ పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిషేధిత భూముల జాబితా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నూజివీడు పట్టణంలోని నిషేధిత భూముల జాబితా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోనున్నట్టు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలో స్వాతంత్ర్యానికి ముందు రిజిస్టర్ అయిన భూములు సైతం నిషేధిత జాబితాలో ఉన్న విషయమై 'భూ ఘోష' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 11వ తేదీన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఆయన స్పందిస్తూ ప్రభుత్వ భూములుగా ఆధారాలు లేని భూములను 22 (ఏ)లో చేర్చడంపై కూటమి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. అటువంటి భూములు ఏమైనా ఉంటే కలెక్టర్‌తో సమా వేశమై జరిగిన తప్పులను సరిచేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటా నన్నారు. ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేరిస్తే సంబంధిత ఆధారాలతో మంత్రి క్యాంప్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. పట్ట ణంలో బహిరంగ మార్కెట్‌కన్నా రిజిస్ట్రేషన్ మార్కెట్ వాల్యు అధికంగా ఉన్న విషయమై 'ఆంధ్రజ్యోతి' మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఎనానమస్ కమిటీ దృష్టికి తీసుకెళ్లి మార్కెట్ విలువ సరిచేసేందుకు చర్యలు చేపడ తానని తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సారథి



కళ్లకు గంతలతో బాణం వేస్తున్న పప్పుల దుర్గేశ్, ఇంద్రజాల ప్రదర్శన

కళ్లకు గంతలు కట్టినా.. చూస్తాడు!

అబ్బురపరిచే దుర్గేశ్ ప్రదర్శనలు

పాలకొల్లు అర్బన్,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కళ్లకు గంతలు కట్టుకుని బైక్ నడుపుతాడు.. బాణం వేస్తాడు.. అతని ప్రదర్శన చూస్తే కళ్లకు గంతలు కట్టినా చూస్తాడు అనిపిస్తుంది. అంత కచ్చితత్వంతో సాగే అతని ప్రదర్శన చూసేవారు ఊపిరి బిగబట్టాల్సిందే. పాలకొల్లు పట్టణానికి చెందిన పప్పుల దుర్గామల్లేశ్వరరావు (దుర్గేశ్) విలువిద్య (ఆర్చరీ) కత్తిసాము, ఇంద్రజాల ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. అతని తండ్రి వెంకట్రావు, తల్లి పద్మావతి. ఆయన తండ్రి కార్మిక నాయకుడిగా అందరికీ సుపరిచితం. అతనికి చిన్నతనంలోనే యాంకిలో జింగ్ స్పాండో లైటిస్ అనే వ్యాధి (ఎముకలు బిగుసుకుపోయే వ్యాధి) సోకింది. భరించలేని నొప్పితో జీవన సమరం సాగించాడు. శరీరం సహకరించకున్నా ఇంద్రజాలంపై మక్కువ పెంచుకున్నాడు. కళ్లకు గంతలతో మోటార్ బైక్ నడుపుతాడు. బాణాలు సంధించి గురితప్పకుండా లక్ష్యాలను ఛేదిస్తాడు. డిగ్రీ అనంతరం సోషలిస్టు ఉద్యమ నేత జాన నాగేశ్వరరావు వద్ద శిష్యరికం చేసిన పలు రంగాల్లో రాణిస్తున్నారు.

- సామాజిక కార్యక్రమాల్లోనూ ముందుంటారు. నేత్రదానం, వ్యక్తిత్వ వికాసంపై యువతకు అవగాహన కల్పించడంతో పాటు పలు పుస్తకాలను రచించాడు. హిందూత్వంపై ప్రచార ఉద్యమాన్ని చేపట్టి విజయవంతంగా సభలు నిర్వహించారు. తన వ్యాధి నివారణకు ఆయుర్వేద వైద్యం నేర్చుకు న్నారు. 'ఆయుర్వేద జ్యోతి' అనే మాస పత్రికను నిర్వహిస్తూ పలువురికి సూచనలు చేస్తున్నారు.



రోడ్లు.. కడగండ్లు

వరుస వర్షాలతో భారీగా దెబ్బతిన్న రహదారులు

- వార్షిక నిర్వహణ, ఎండీఆర్‌ల కింద సీఈకి నివేదిక
- నిధులు రావడమే ఇక అవశ్యం

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గత నెలతో పాటు ఈనెలలో కురిసిన భారీ వర్షాలు రోడ్లకు కడగండ్లను మిగిల్చాయి. ఈ ఏడాది సంక్రాంతి తర్వాత ఉమ్మడి జిల్లాల్లో భారీగా గోతుల తేలిన రహదారాలను తీర్చిదిద్దారు. మరికొన్నిచోట్ల మరమ్మతులను చేపట్టారు. ఆగస్టులో సాధారణం కంటే అసాధారణమైన వర్షపాతం నమోదైన కారణంగా రోడ్లకు కోలుకోలేని భారీ నష్టాలు సంభవించాయి. చాలాచోట్ల రోడ్లు అభివృద్ధి చేసిన సమయంలో రోడ్లపై వరదపోటు తీవ్రంగా పడింది. ఈమేరకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో భారీగా నిధులను కోరుతూ జిల్లా రోడ్లు, భవనాలశాఖ పూర్తిగా ప్రతిపాదనలను సిద్ధం చేసింది. రెండు విధాలుగా యాన్యువల్ మెయింటినెన్స్ గ్రాంట్, మేజర్ డిస్ట్రిక్టు రోడ్లు (ఎండీఆర్) అభివృద్ధి చేయడానికి భారీగా ప్రతిపాదనలు తయారు చేసి పంపింది. ఇటీవలే ఎండీఆర్ కింద రాష్ట్రానికి ప్రభుత్వం రూ.500 కోట్లు నిధులను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పంపించిన ప్రతిపాదనలతో రాబోయే కాలంలో ఎండీఆర్ గ్రాంట్ కింద పనులకు నిధులు మంజూరు చేసే అవకాశం ఉండనుంది. ఇది చీఫ్ ఇంజనీర్ స్థాయిలో జరిగే అవకాశం ఉండంతో జిల్లా యంత్రాంగం నిధులు కోరుతూ నివేదికను సమర్పించింది. వీటికి నిధులు యుద్ధప్రాతిపదికన విడుదలయ్యే అవకాశాలున్నట్లు ఆర్అండ్‌బీ ఎస్ఈ కె.విజయరత్నం తెలిపారు.

'పశ్చిమ'లోనూ తీవ్రంగా నష్టం..

పశ్చిమ గోదావరి జిల్లాలో రాష్ట్ర రహదారులు 459,79 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. ఇందులో వార్షిక నిర్వహణ గ్రాంట్ కింద 111.86 కిలోమీటర్లను 1కోటి56లక్షల39వేల రూపాయలతో మరమ్మతులు చేయడానికి నిర్ణయించారు. అదేవిధంగా భారీగా గోతులు తేలిన రహదారులు 167.8 కిలోమీటర్ల బాగు చేతకు 22కోట్ల29లక్షల రూపాయలతోను, మరమ్మతులు చేయడానికి వీల్లేకుండా రోడ్లు ఛిద్రమైన 35.06 కిలోమీటర్ల మేర నూతనంగా రోడ్లు వేయడానికి 44కోట్ల10లక్షల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

- మేజర్ డిస్ట్రిక్టు రోడ్లు(ఎండీఆర్) కింద 1,108.91 కిలోమీటర్ల మేర రహదారుల వ్యవస్థలో 222.79 కిలోమీటర్ల వార్షిక నిర్వహణ గ్రాంట్ కింద తక్షణ మరమ్మతులు చేయనున్నారు. దీనికి 1కోటి71లక్షల88 వేలు రూపాయల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. భారీగా గోతులు తేలిన 357.89 కిలోమీటర్లకు మరమ్మతులు చేయడానికి 1కోటి71లక్షల 43వేలు రూపాయలు, పూర్తిగా దెబ్బతిన్న రోడ్లు 171.43 కిలోమీటర్లు అభివృద్ధి చేయడానికి 15కోట్ల85లక్షల రూపాయల వ్యయం అవుతుందని అంచనాలు సిద్ధం చేశారు.

ఏలూరు జిల్లాలో భారీగా తూట్లు

ఏలూరు జిల్లాలో భారీ వర్షాలు రోడ్లకు కడగండ్లు మిగిల్చాయి. రాష్ట్ర రహదారులు 698.82 కిలో మీటర్లకు గాను 150.14 కిలోమీటర్ల రహదార్లు దెబ్బతినగా, 1కోటి58లక్షల రూపాయలతో వార్షిక నిర్వహణ కింద మరమ్మతులు చేపట్టనున్నారు. 108.93 కిలోమీటర్ల మేర రోడ్లపై భారీ గోతులు తేలాయి. వీటికి పూర్తి మరమ్మతులు చేయడాకికి 15కోట్ల90 లక్షలు రూపాయలు వెచ్చించనున్నారు. మరమ్మతులకు వీల్లేని విధంగా పాడైన 41.25 కిలోమీటర్ల రోడ్లు బాగుచేతకు 4కోట్ల20లక్షలు రూపాయలు వెచ్చించనున్నారు.

- మేజర్ డిస్ట్రిక్టు రోడ్లు పథకం కింద 1,137 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతినగా, తక్షణ మరమ్మతుల కోసం 307.04 కిలోమీటర్ల మేర 1కోటి47లక్షల26వేల రూపాయలతో వార్షిక నిర్వహణ గ్రాంట్‌తో బాగు చేయనున్నారు. అదేవిధంగా 147.26 కిలోమీటర్లు మేర భారీ గోతులు తేలిన రహదారుల మరమ్మతులను 14కోట్ల34లక్షల రూపాయలతోను, 233.75 కిలోమీటర్ల 15కోట్ల45లక్షల రూపాయల వ్యయంతో రోడ్లను అభివృద్ధి చేయనున్నారు.

ఫ్రీ బస్సు..జోష్

ఉచిత బస్సు ప్రయాణాలు.. పోటెత్తుతున్న పుణ్యక్షేత్రాలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గతంలో కుటుంబంతో సహా తీర్థయాత్రలకు వెళ్లేందుకు బస్సు ఎక్కాలంటే మధ్యతరగతి వారు జేబునిండా డబ్బు చూసుకోవాల్సి వచ్చేది. షాక్ కొట్టే బస్సు చార్జీలతో పాటు అక్కడి సాధారణ ఖర్చులు అన్నీ వారికి తడిపి మోపెడయ్యేవి. ఈమేరకు ఎక్కడికైనా వెళ్లేందుకు కాస్త ఆలోచించేవారు.. ఎంతో ముఖ్యమైతేనే కుటుంబంతో పాటు బయటకు కదిలేవారు. ఇక సీఎం చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయడం మొదలు పెట్టడంతో మహిళల దశ తిరిగిందని చెప్పొచ్చు. దీనిలో బాగంగా స్త్రీ శక్తి పేరుతో మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభించారు. ఈ పథకం అన్ని తరగతులవారికి ఎంతో వెసులుబాటు కల్పిస్తుంది. ఈ పథకాన్ని వినియోగించుకుని మహిళలు ఎన్నో ఆధ్యాత్మిక ప్రాంతాలను చుట్టేస్తున్నారు. తమ కుటుంబసభ్యులతోనో, స్నేహితులతోనో, పక్క ఇంటి వారితోనో కలిసి పలు ప్రముఖ దేవాలయాలను ఉత్సాహంగా చుట్టేస్తున్నారు. దైవదర్శనం చేసుకుని సేదతీరుతున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్లే ఇదంతా జరుగుతోందని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ప్రముఖ క్షేత్రాల సందర్శన..

ఉచిత బస్సు ప్రయాణాల కారణంగా రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలైన ద్వారకాతిరుమల, విజయవాడ, అన్నవరం, సింహాచలం, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి వంటి క్షేత్రాల్లో మహిళల రద్దీ కనిపిస్తోంది. దూరంగా ఉన్న ఆలయాలతో పాటు వారికి దగ్గరలోని ఆలయాలను సైతం దర్శిస్తూ ఎంత హాయిలే ఇలా అంటూ జోష్‌తో వెళుతున్నారు. ఈ క్రమంలో ఉభయగోదావరి జిల్లాలోని ద్వారకాతిరుమల, మద్దిక్షేత్రం, వాడపల్లి, భీమవరం మావుళ్లమ్మ, పంచారామక్షేత్రాలు, పారిజాతగిరి, అప్పన్నపల్లి, వంటి ఆలయాల్లోని దేవేరులను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. ద్వారకాతిరుమలలో దైవదర్శనం అనంతరం ఉచిత భోజన, ప్రసాద సౌకర్యంతో ఆ ప్రాంగణంలో మహిళలతో పోటెత్తుతున్నాయి. బస్సులు సైతం అధిక శాతం మంది మహిళలతోనే నిండిపోతున్నాయి. ఆక్యుపెన్సీ పెరిగిందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. త్వరలోనే మరిన్ని కొత్త బస్సులు వస్తాయని.. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని వారు వివరిస్తున్నారు.



ద్వారకాతిరుమల బస్టాండ్‌లో కిటకిటలాడుతున్న మహిళా ప్రయాణికులు

ఫ్రీ బస్సు ప్రయాణం బాగుంది..



ఇంట్లో అందరం బయలుదేరినా బస్సు ప్రయాణంలో రూపాయి ఖర్చు కాలేదు. గుంటూరు నుంచి వచ్చి దైవదర్శనం చేసుకున్నాం. బస్సులు రద్దీగా ఉన్నా ప్రయాణం సాఫీగానేసాగింది. ఆలయాలను దర్శిస్తున్నాం. ప్రభుత్వం పెట్టిన ఈ పథకం ఎంతో ఊరటగా ఉంది.

- చింతలపల్లి మంగమ్మ భక్తురాలు, గుంటూరు.

చాన్నాళ్ల మొక్కు.. ఇప్పుడు తీరింది..



ద్వారకా తిరుమల ఆలయానికి వద్దామన్న మొక్కు ఇప్పటిది కాదు. కొన్ని సంవత్సరాల నుంచి వెళదామనుకున్నాం. కానీ కుదరలేదు. ఇప్పుడు ఫ్రీబస్సు ప్రయాణంతో కలిసివచ్చింది. కుటుంబంతో సహా ఇక్కడకు వచ్చాం. మొక్కులు తీర్చుకున్నాం ఆనందంగా ఉంది.

- లింగం నాగలక్ష్మి.. గృహిణి, విజయవాడ.



శ్రీవారి ఆలయ మెట్లదారిపై మహిళా భక్తుల రద్దీ

మార్మోగిన గోవింద నామస్మరణ

శ్రీనివాసా గోవిందా.. శ్రీవేంకటేశా గోవిందా.. అంటూ గోవిందనామాలతో శ్రీవారి క్షేత్రం శనివారం మార్మో గింది. రెండో శనివారం సెలవు రోజు కావడం, అందులోనూ స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయానికి ఉదయం నుంచి భక్తులు వచ్చారు. దాదాపు 20వేల మంది వరకు భక్తులు వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. స్వామి దర్శన అనంతరం నిత్యాన్నదాన సదనంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సంస్కృతి, సంప్రదాయాలు చాటిన టీచర్ నీలిమ



మధ్యప్రదేశ్‌లోని జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న టీచర్ నీలిమ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'సహజ, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో పాఠశాలల పాత్ర' అనే అంశంపై ఇటీవల మధ్యప్రదేశ్‌లోని దామోహ్ ప్రాంతీయకేంద్రంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. పది రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో దేశంలోని పది రాష్ట్రాలనుంచి 65మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరిలో మన రాష్ట్రం నుంచి ఏడుగురు ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. ఈ ఏడుగురిలో ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం జడ్పీ పాఠశాల ఉపాధ్యాయురాలు జి.నీలిమకు అరుదైన అవకాశం దక్కింది. ఆయా కార్యక్రమంలో గోదావరి మాండలికాలు, ఏపీ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెబుతూ ఇచ్చిన ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. జానపద నృత్యం, దేశభక్తిగీతాలు ప్రత్యేకతను చాటాయి. జాతీయస్థాయిలో అందరి అభినందనలు పొందాయి.



32 రకాల వంటకాలతో అన్నసమారాధన

ఆకివీడు రూరల్, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): ఆకివీడు మండలం గుమ్ములూరు గ్రామంలో గణేష్ నవరాత్రులలో భాగంగా 32 రకాల వంటకాలతో అన్నసమారాధన నిర్వహించారు. గ్రామంలో ప్రతిఏటా శ్రీవరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో గణనాథుడి నవరాత్రులు నిర్వహిస్తారు. అన్నసమారాధన రోజున గ్రామస్థులలో చాలామంది తమకు నచ్చిన వంటకాన్ని అదనంగా అందజేస్తారు. ఈవిధంగా 32 రకాల వంటకాలతోపాటు క్యారీబ్యాగ్‌లు అందజేస్తారు. తినలేనివి ఇంటికి తీసుకువెళ్లడానికి వీలుగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సుమారు మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు.



కైకలూరు, తణుకు పట్టణానికి చెందిన కూచిపూడి నృత్యాల దృశ్యాలు

సమ్మోహనం.. నృత్యోత్సవం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 13, (ఆంధ్రజ్యోతి) : కళాకారుల నాట్య విన్యాసాలు, అందెల రవళితో వైఎంహెచ్ఏ ప్రాంగణం పులకించింది. కూచిపూడి భరతనాట్యం శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. నటరాజ నాట్య కళాక్షేత్రం, శ్రీశ్రీ కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో 12వ జాతీయ డ్యాన్స్, మ్యూజిక్ అవార్డ్స్ కార్యక్రమం శనివారం కన్నుల పండుగగా జరిగింది. కళారత్న పార్వతీ రామచంద్రన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి చిన్నారులు కళాకారులు పాల్గొన్నారు. నిర్వాహకులు ఎస్ఆర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ సంస్థ ద్వారా లలిత కళలను ప్రోత్సహించడమే కాకుండా కళాకారులను ఒకే వేదికపై తీసుకువచ్చి ప్రోత్సహించడంలో ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ నాట్యాచార్యులను, జ్ఞాపికలు అవార్డులతో సత్కరించారు. నటరాజ నాట్య కళాక్షేత్రం, అత్యాచార్యులు రాజేష్‌కుమార్, కృష్ణవేణి పర్యవేక్షించారు.



జ్ఞాపికలు అవార్డులతో నృత్య కళాకారులు

వెంకట్ (పేరు మార్చడమైనది) అనే వ్యక్తి తన కారుకి నాలుగు టైర్లు మార్పించడానికి షోరూంకి వెల్లాడు. రూ.32 వేలకు బేరం ఆడి టైర్లు తీసుకునే సమయంలో జీఎస్టీ ఎంత అని ప్రశ్నించాడు. షోరూం యజమాని తాము బిల్లులో వేసే జీఎస్టీ చూపించగా వెంటనే కొనుగోలు ఆపివేసి ఈనెల 22 తర్వాత వస్తానని తిరుగుముఖం పట్టాడు.

గోపాల్ అనే వ్యక్తి తాను ఎప్పటినుంచో కొనాలనుకుంటున్న కారు తెచ్చుకోవడానికి షోరూంకి వెల్లాడు. అక్కడ జీఎస్‌టీ తగ్గింపు ముందు రూ.16లక్షలు ఉన్న కారు రూ.14.5 లక్షలు ఇస్తామని షోరూం వాళ్లు చెప్పారు. అయితే ఈనెల 22 తరువాత మరింత రేటు తగ్గుతుందని కొనుగోలు వాయిదా వేశాడు.

- జీఎస్టీ ఎఫెక్ట్ ..

మార్కెట్ వెలవెల

- ధరలు తగ్గుతాయని వేసి చూస్తున్న కొనుగోలుదారులు
- జీఎస్టీ తగ్గింపు ప్రకటన ప్రభావం
- ఎల్ఐసీ సంస్థదీ అదే పరిస్థితి





పాలకొల్లు ఖాళీగా ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువుల షోరూమ్

పాలకొల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌పై జీఎస్టీ తగ్గింపు ప్రభావం స్పష్టగా కనిపిస్తుంది. ఈనెల 22నుంచి పలు వస్తువులపై జీఎస్టీ తగ్గుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని మార్కెట్‌లపై ప్రభావం పడింది. ఏసీలు, కూలర్లు టీవీలు ఫ్రిజ్‌లు మోటారుసైకిళ్లు, కార్లు అన్నిరకాల షోరూంలు గత పది రోజులుగా కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్నాయి. పలు కార్లు కంపెనీలు మోటారు సైకిల్ కంపెనీలు ఇప్పటికే ధరలు తగ్గించాయి. ఈనెల 22 తర్వాత మరింతగా తగ్గే అవకాశం ఉంటుందని బావిస్తున్న కోనుగోలుదారులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. పట్టణాలలోని ప్రధాన మార్కెట్ కూడళ్లలో కళ తగ్గింది. షాపులలో కొనుగోలుదారులు లేక వారం పొడవునా వారాంతం సెలవుదినంగానే కనిపిస్తుంది.

పలు రకాలు ఉపకరణాలపై జీఎస్‌టీ ఎంత మేరకు తగ్గిస్తున్నదీ కేంద్రం స్పష్టంగా ప్రకటించినప్పటికీ ఆయా వస్తువులు కొనుగోలుదారులు అయోమయానికి గురవుతున్నారు. ఈనెల 22 తర్వాతే కొనుగోలు చేస్తే మరింతగా తగ్గుతుందని ఆశిస్తూ వేచి చూస్తున్నారు.

ఎల్ఐసీ సంస్థ పరిస్థితి అంతే..

ఎల్ఐసీ పాత ప్రీమియం చెల్లింపు కొత్త పాలసీలు సేకరణ గత పది రోజులుగా మందకొడిగా ఉన్నట్టు ఎల్ఐసీ ఏజెంట్లు చెబుతున్నారు. ఎల్ఐసీ ప్రీమియంలపై జీఎస్‌టీ తగ్గింపు ఎలా ఉంటుందనే అంశంపై స్పష్టత లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు బీమారంగ నిపుణులు చెబుతున్నారు. ఏదైనా ఈనెల 22 తర్వాతే బీమా వ్యాపారం పుంజుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

న్యాయం చేయకపోతే సెల్ టవరెక్కి దూకేస్తా..

- వరి చేలలోకి ఉప్పునీరు చేరి పంట పాడవుతుందంటూ కౌలు రైతు రాజేశ్ ఆవేదన



ఉప్పులూరులో పాడైన వరి పొలాన్ని చూపుతున్న రాజేశ్

ఉండి, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): 'వరి చేలలోకి ఆక్వాచెరువుల్లోని ఉప్పు నీరు చేరి పాడవుతోందని, ఆక్రమణలకు గురైందని, తనకు న్యాయం చేయకపోతే సెల్ టవర్ ఎక్కి దూకేస్తానని' కౌలురైతు రాజేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఉప్పులూరు గ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన 13 ఎకరాల 4 సెంట్లు భూమిని గత జూన్ నెలలో రు.4లక్షల 46 వేలకు రెండు పంట కౌలు నిమిత్తం పాడుకున్నాడు. ఆగస్టు 1, 2 తేదీల్లో ఊడ్పులు ఊడ్చాడు. రెండు రోజులుగా వర్షాలు కురవడంతో శనివారం పొలం వద్దకు వెళ్లి పరిశీలించాడు. ఆక్వా చెరువుల నుంచి ఉప్పునీరు వచ్చి చేరడంతో వరిచేను నాశనమైందని కన్నీరుపెటుకున్నాడు. ఇప్పటికే పలుమార్లు పెద్దలకు చెప్పిన ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గతంలో కూడా 2015 సంవత్సరంలో కౌలుకు పాడుకుని సాగుచేశానని ఎప్పుడు చేసినా.. తనకు నష్టమే వస్తుందని తెలిపాడు. పొలాన్ని సర్వే చేయిస్తే సుమారు ఒక ఎకరం భూమి ఆక్రమణకు గురయినట్టు గుర్తించినట్టు తెలిపాడు. ఇప్పటికే అప్పులుపాలైనట్టు తెలిపారు. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు, కూటమి నాయకులు, గ్రామపెద్దలు తనను ఆదుకుని న్యాయం చేయాలని కోరాడు.

న్యాయం చేస్తాం : సర్పంచ్ దుర్గారావు

కౌలుకు సాగుచేస్తున్న దేవస్థానం భూములను గ్రామ సర్పంచ్ యర్రా దుర్గారావు శనివారం విచ్చేసి పరిశీలించారు. ఆలయ భూములను ఆక్రమించిన సరిహద్దు రైతులు కరెంటు స్తంభాలను నిర్మించడం, గ్రావెల్ రహదారిని నిర్మించుకోవడం, మురుగుబోదెను ఏర్పాటు చేసుకోవడం, ఉప్పునీరు చేరిక వంటివాటిని పరిశీలించినట్టు తెలిపారు. కౌలురైతుకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఆల్‌టైం రికార్డు ధర

వర్జీనియా పొగాకు @ 430

» ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు


ఎంపీ మహేశ్‌ను సన్మానిస్తున్న రైతులు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వర్జీనియా పొగాకు ధరలకు రెక్కలొచ్చాయి. మునుపెన్నడూ లేనివిధంగా కొయ్యలగూడెం వేలం కేంద్రంలో శనివారం కిలో క్వాలిటీ వర్జీనియా పొగాకు ధర రూ.430 పలికింది. ఇది ఎన్‌ఎల్‌ఎస్ చరిత్రలోనే రికార్డు ధర. గత ఏడాది కిలో పొగాకుకు అధిక ధర రూ.411 పలకగా ఈ ఏడాది రూ.19 అదనంగా పెరిగి రికార్డు సృష్టించింది. శుక్రవారం జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-32లో కిలో పొగాకు ధర రూ.418 చేరింది. ప్రస్తుతం కిలో ధర 430కు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ పుట్టా మహేశ్‌కు సన్మానం..

ఏలూరుటూటౌన్/బుట్టాయగూడెం: అదనపు పొగాకు కొనుగోళ్లకు కేంద్రం నుంచి అనుమతులు సాధించిన ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ఎంపీ క్యాంపు కార్యాలయంలో శనివారం పోలవరం, చింతలపూడి, గోపాలపురం మండలాలకు చెందిన వర్జీనియా పొగాకు, పామాయిల్ రైతులు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు.

ఐదు వేలం కేంద్రాల్లో శనివారం ధరలు ఇలా..

కొయ్యలగూడెం వేలం కేంద్రం-క్వాలిటీ పొగాకు కిలో ధర రూ.430, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-32లో ధర రూ.429, గోపాలపురం వేలం కేంద్రంలో రూ.429, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-18లో రూ.428, దేవరపల్లి వేలం కేంద్రంలో రూ.428, లో -గ్రేడు పొగాకు దేవరపల్లిలో కిలో రూ.130 ఉండగా మిగతా నాలుగు వేలం కేంద్రాల్లో రూ.200గా ఉంది. లో-గ్రేడు పొగాకు ధరలు పెరిగితే రైతులకు పూర్తి లబ్ధి చేకూరినట్లు అవుతుంది.

16న జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

పెదపాడు/ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరగనున్న అంతర్ జిల్లాల జూనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొనే బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికను ఈనెల 16వ తేదీన నిర్వహిస్తామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కె.రంగారావు, ప్రెసిడెంట్ ఎం. శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.రంగారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజ నీరింగ్ కళాశాలలో ఆరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఏలూరు జిల్లాకు చెంది, 1-1-2006 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. 75 కేజీల లోపు బాలురు, 65 కేజీల లోపు బాలికలు ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరు 22 నుంచి 25వ తేదీ వరకు విజయవాడ, గొల్లపూడిలో జరిగే అంతర్ జిల్లాల జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనా లన్నారు. మరిన్ని వివరాలకు 99519 31133, 88856 23693, 99851 47123 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ జిల్లా క్రీడాజట్ల ఎంపిక


పరుగు పందెంలో క్రీడాకారులు

పెదవేగి, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వరంలో ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిధిలో జరుగుతున్న 19 ఏళ్ల విభాగం క్రీడా జట్ల ఎంపిక పోటీలు శనివారంతో ముగిశాయి. ఏలూరు జిల్లా పెదవేగిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో శనివారం ఆఖరిరోజు పోటీల్లో బాల, బాలికలకు అథ్లెటిక్స్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలు నిర్వహించి, ప్రతిభ గల క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశామని డీవీఈవో టి.శేఖర్‌బాబు తెలిపారు. ఎంపికైన జట్లు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో ఆర్ఐవో యోహాను, డీసీవో ఉమాకుమారి, గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఏవీ.శివప్రసాద్, పీడీలు పాల్గొన్నారు.

జాతీయ సహకార సదస్సుకు హాజరైన 'గన్ని'


సదస్సులో హరియాణా ఉప ముఖ్యమంత్రి ముఖేష్ అగ్నిహోత్రితో గన్ని కరచాలనం

ఏలూరు,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం సిమ్లాలో మూడు రోజుల పాటు జరుగుతున్న జాతీయ సహకార సదస్సుకు ఏలూరు డీసీసీబీ ఛైర్మన్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు శనివారం హాజరయ్యారు. తొలిరోజు సభ్యులు పరిచయం, పలు అంశాలపై చర్చలు సాగాయి. సహకార బ్యాంకుల పనితీరులో ఏపీ రెండోస్థానం సాధించింది. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులుకు ఈ అవార్డును ఆదివారం ప్రదానం చేయనున్నారు. హరియాణా ఉపముఖ్యమంత్రి ముఖేష్ అగ్నిహోత్రితో గన్ని, ఆప్కాబ్ ఎండీ ఎస్ఆర్ శ్రీనాథ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

పెనుగొండ సర్పంచ్‌కు ఢిల్లీ సదస్సు ఆహ్వానం


శ్యామలా సోని శాస్త్రి

పెనుగొండ, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి):పెనుగొండ గ్రామ సర్పంచ్ నక్కా శ్యామలా సోనిశాస్త్రికి అరుదైన అవకాశం దక్కింది. ఢిల్లీలో ఈనెల 15న భారత్ నాణ్యతా మండలి (క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'సర్పంచ్ సంవాద్ కాన్ క్లేవ్'కు ఆహ్వానం అందినట్టు తెలిపారు. జలశక్తి మంత్రిత్వ శాఖ సహకారంతో జరుగుతున్న సదస్సుకు దేశవ్యాప్తంగా 75 మంది సర్పంచ్‌లను ఎంపిక చేయగా అందులో ఆమె 11వ స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, పలువురు సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు.


ఇటీవల ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

డీఎస్సీ ఉపాధ్యాయ ఉద్యోగ

ఎంపికలు ఓకే..

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్ ముగింపు దశకు చేరుకుంది. డీఎస్సీ-2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు తుదిగా ఎంపికైన అభ్యర్థుల జాబితాలు ఖరారయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నోటిఫై చేసిన మొత్తం 1074 పోస్టులకు మెరిట్ కం రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా జిల్లాలకు సంబంధించి తుది ఎంపికలను రాష్ట్రస్థాయిలోనే పూర్తిచేసి, జాబితాలను డీఈవోలకు అందజేశారు.

» 1074 పోస్టులకు అభ్యర్థుల ఖరారు!
» శాఖల వారీగా జాబితాలు అప్రూవల్‌కు పంపిన విద్యాశాఖ
» 15న అధికారికంగా తుది ఎంపిక జాబితాల విడుదలకు సన్నాహాలు
» 19న వెలగపూడిలో భారీ సభ... అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత
» అభ్యర్థులను విజయవాడ తరలించేందుకు ఏలూరులో ఏర్పాట్లపై కసరత్తు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో 1035 పోస్టులు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 32, జువనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పాఠశాలలో 7 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాలు జిల్లా విద్యా శాఖకు అందాయి. వీటిని శనివారం మరో దఫా పరిశీలించి సంబంధిత శాఖల జిల్లా అధికారుల అప్రూవల్ నిమిత్తం పంపించారు. మున్సిపల్ పోస్టులకు రాజమహేంద్రవరంలోని పురపాలక శాఖ రీజనల్ డైరెక్టర్, జిల్లా పరిషత్ పోస్టులకు డీఈవో/జడ్పీ సీఈవో, గిరిజన సంక్షేమ శాఖ పోస్టులకు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్, జువనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పోస్టులకు సంబంధిత శాఖ జిల్లా అధికారి సంబంధిత జాబితాలపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఆ వెంటనే డీఎస్సీ కన్వీనర్, ఉమ్మడి జిల్లా డీఈవో సంబంధిత శాఖల జిల్లా హెచ్‌వోడీలు సంతకాలు చేసిన జాబితాలపై తుది ఆమోదానికి కాకినాడ ఆర్జేడీ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌కు సమర్పిస్తారు. ఇవన్నీ ఆదివారంలోగా పూర్తికావాల్సి ఉంది. ఆ తర్వాత డీఎస్సీ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల పేర్లను ఆయా యాజమాన్యాల వారీగా సోమవారం అధికారికంగా ప్రభుత్వం విడుదల చేసే అవకాశం ఉంది. అందుబాటులో ఉన్న వెకెన్సీలకు పోస్టింగ్స్ కేటాయింపుపై 16, 17 తేదీల్లో వెబ్ ఆప్షన్‌ను స్వీకరించి, 19న అపాయింట్ మెంట్ లెటర్లు జారీ చేస్తారు. నియామక పత్రాలు పొందిన కొత్త టీచర్లు వారికి కేటాయించిన పాఠశాలల్లో 20, 21 తేదీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. 22 లేదా 23 నుంచి దసరా సెలవుల్లో శిక్షణ ఉంటుంది. దీనిపై ఇంత వరకు విద్యాశాఖ నుంచి ప్రకటనేదీ లేదు.

వసతికి స్కూల్స్‌లో ఏర్పాట్లపై డైలమా..

ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన ప్రతి అభ్యర్థితోపాటు సహాయకులుగా మరొకరిని వెంటబెట్టుకుని విజయవాడలో ఈ నెల 19న నిర్వహించనున్న నియామక పత్రాల అందజేత కార్యక్రమానికి తీసుకెళ్లేలా జిల్లాలో ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. ఆ మేరకు ఉమ్మడి జిల్లాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను విజయవాడకు తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లన్నీ ఏలూరు కేంద్రంగానే జరగాలని స్పష్టం చేశారు. దీనికనుగుణంగానే ఏలూరులో అభ్యర్థులు, వారి వెంట ఒక సహాయకుల వంతున మొత్తం 2150 మందికి సరిపడా 18వ తేదీ సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు భోజనం, అల్పాహారం, నిద్రించడానికి వసతి సౌకర్యాలను కల్పించాల్సి ఉంది. అభ్యర్థులను విజయవాడ తీసుకు రావడానికి మొత్తం 50 ఆర్టీసీ బస్సులను ప్రభుత్వమే సమకూర్చింది. అభ్యర్థులందరికీ కళ్యాణ మండపాల్లో వసతి సౌకర్యం కల్పించడానికి జిల్లా విద్యాశాఖ తొలుత ప్రయత్నాలు చేసింది. ఫంక్షన్ హాళ్లలో గంటకు రూ.10 వేలు చొప్పున అద్దె చెల్లించాలని నిర్వాహకులు తేల్చిచెప్పడంతో, ఆర్థిక భారం దృష్ట్యా ఏలూరులోని 9 పాఠశాలలను ఎంపిక చేసింది. ఒకవేళ ప్రభుత్వం నిధులు విడుదల చేసినా ఈ ఫంక్షన్ హాళ్లలో తగినన్ని టాయిలెట్లు లేవని విద్యాశాఖ అధికారులు గుర్తించి, వాటికంటే ఈ పాఠశాలలే బెటరని అభిప్రాయానికి వచ్చి నిర్ణయం తీసుకున్నారు. కాగా ఈ పాఠశాలల తరగతి గదుల్లో ఫర్నిచర్‌ను వేరేచోటకు మార్చడంతోపాటు, ముందస్తు ఏర్పాట్ల నిమిత్తం 18, 19 తేదీల్లో తరగతుల నిర్వహణ సాధ్యం కాదని భావిస్తున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని 48 మండలాల ఎంఈవోలు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులందరినీ 18, 19 తేదీల్లో అందుబాటులో ఉండేలా విధులు కేటాయించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదే విషయమై డీఈవో వెంకట లక్ష్మమ్మ శనివారం మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను 19న విజయవాడ తీసుకెళ్లేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏలూరులో ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఉద్యోగాలు పొందిన వారికి దసరా సెలవుల్లో శిక్షణ ఉంటుందన్నారు.

ఏక కాలంలో నియామక పత్రాల పంపిణీ?

మెగా డీఎస్సీ ఉపాధ్యాయ ఉద్యోగాలకు తుదిగా ఎంపికైన అభ్యర్థుల జాబితాలను సోమ లేదా మంగళవారాల్లో విద్యాశాఖ మంత్రి లోకేశ్ విడుదల చేసే అవకాశం ఉంది. ఆ తర్వాత 19న వెలగపూడిలో నిర్వహించనున్న భారీ సభలో డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నట్టు తెలిసింది. డీఎస్సీకి ఎంపికైన 16 వేల మంది అభ్యర్థులతోపాటు, వారి సహాయకులు మొత్తం 32 వేల మందితోపాటు, కూటమి ప్రభుత్వంలోని పార్టీలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీల శ్రేణులు కలిపి సుమారు లక్ష మంది ఈ సభకు హాజరవుతారని సమాచారం. రాగల కొద్దిరోజుల్లోనే ఈ ఏర్పాట్లపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా గతంలో సీఎంగా చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో జరిగిన డీఎస్సీ నియామకాల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులందరితో ఒకేసారి ప్రమాణ స్వీకారం చేయించిన మాదిరిగానే ఈ దఫా కూడా నియామక పత్రాల అందజేత ప్రక్రియ ఉండవచ్చునని తెలుస్తోంది. అభ్యర్థులకు పోస్టింగ్స్ కేటాయించే విషయమై స్పష్టత రావాల్సి ఉంది.

పలు కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

ఏలూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు కార్పొరేషన్ల డైరెక్టర్ల పదవులకు ఉమ్మడి జిల్లాల్లోని కూటమి నేతలకు చోటు దక్కింది. ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) డైరెక్టర్లుగా భీమవరానికి చెందిన చెన్నమల్ల చంద్రశేఖర్ (టీడీపీ), పాలకొల్లుకు చెందిన కడ్లి గోపాలరావు (టీడీపీ), ఏపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొయ్యలగూడెంకు చెందిన మోడేపల్లి నాగు (బీజేపీ) నియమితులయ్యారు.

'మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వద్దు'

నూజివీడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం నూజివీడులో జరిగిన ఏలూరు జిల్లా సీఐటీయూ 13వ మహాసభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికులను, ఉద్యోగులను చిన్నచూపు చూస్తున్నాయన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.1500 ఇస్తానన్న హామీ ఏమైందన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజా రామ్మోహన్‌రాయ్, జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

నన్ను కెలికితే నాలోని అపరిచితుడు బయటికొస్తాడు

అవినీతికి తావివ్వను.. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



భీమవరం టౌన్ సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాను నిజాయితీగా, అవినీతికి తావులేకుండా విలువలతో కూడిన రాజకీయాలు చేస్తానని, బాధ్యత లేని వ్యక్తులు తనను కెలికితే తనలోని అపరిచితుడు బయటకు వస్తాడని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. భీమవరంలో జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను గానీ, తన చుట్టూ ఉన్న వ్యక్తులు గానీ అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడినట్లు మీ దృష్టికి వస్తే, దయచేసి పత్రికా ముఖంగా నాకు తెలియజేయండని కోరారు.

అభివృద్ధే నా బ్రాండ్

భీమవరం బైపాస్, ఎన్.హెచ్.-165 కు నిధుల మంజూరు, నరసాపురానికి వందే భారత్ రైలు, రోడ్డు నిర్మాణానికి సి.ఐ.ఆర్.ఎఫ్. నిధులు, పార్లమెంట్ పరిధిలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలు తన బ్రాండ్‌గా నిలిచాయని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, తనను కలవడానికి మధ్యవర్తులు లేదా అపాయింట్‌మెంట్‌లు అవసరం లేదన్నారు. దీర్ఘకాల పెండింగ్ ప్రాజక్టులు పూర్తి చెయ్యటమే లక్ష్యంగా పెట్టుకున్నానన్నారు.

నరసాపురం వరకు వందేభారత్ పొడిగింపు

వందేభారత్ రైలు ప్రస్తుతం చైన్నై- విజయవాడ వరకు నడుస్తోందని అది నరసాపురం వరకు పొడిగించారని తెలిపారు. గుడివాడ, భీమవరం స్టేషన్‌లో ఆగుతుందని, నరసాపురం 2-10కి చేరుకుంటుందని తిరిగి 2-50కు బయలుదేరుతుందన్నారు. మంగళవారంనాడు వందేభారత్ ఉండదని తెలిపారు.

16, 17 తేదీల్లో ఎస్జీఎఫ్ క్రీడా ఎంపికలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అన్ని యాజమాన్యాల హైస్కూళ్లలోని అండర్-14, 17 బాలబాలికలకు పలు విభాగాల్లో జిల్లాస్థాయి ఎంపికల షెడ్యూలును ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.అలివేలు మంగ శనివారం విడుదల చేశారు. ఈ నెల 16న వెయిట్ లిఫ్టింగ్ అండర్-17 బాలబాలికల ఎంపికలు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం, స్విమ్మింగ్ అండర్-14, 17 బాలబాలికలకు ఏలూరు సీతారామరాజు స్విమ్మింగ్ పూల్ విభాగంలో ఎంపికలు జరుగుతాయి. ఈ నెల 17న కరాటే అండర్-14, 17 బాలబాలికలకు ఎంపికలు ఏలూరు మినీ బైపాస్ రోడ్డు కాస్మోపాలిటన్ క్లబ్‌లో జరుగుతాయి. అండర్-14 ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు 2012 జనవరి 1వ తేదీ తర్వాత, అండర్-17 బాలబాలికలు 2009 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. క్రీడాకారులు చదువుతున్న స్కూలు/కాలేజీ హెచ్ఎం లేదా ప్రిన్సిపాల్ సంతకంతో కూడిన ఎంట్రీ ఫారంను విధిగా తీసుకురావాలని, లేనట్టయితే ఎంపికల్లో పాల్గొనేందుకు అనుమతించబోమని స్పష్టం చేశారు. వివరాలకు 90308 94311లో సంప్రదించాలని కోరారు.

సామరస్యంగా కేసులు పరిష్కారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ - మొత్తంగా 3,281 కేసులు రాజీ


కక్షిదారులకు వాహన ప్రమాద బీమా పరిహారం అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందని రాజీమార్గం రాజమార్గమని, ఇరుపక్షాలు మధ్య స్నేహ సంబంధాలు పెరుగుతాయని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీదేవి అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన 3వ జాతీయ లోక్ అదాలత్‌ను న్యామూర్తి శ్రీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇరుపక్షాల అంగీకారంతో, సామరస్య వాతావరణంలో కేసులు పరిష్కారం చేయడమే జాతీయ లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. ఇప్పటి వరకూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వివిధ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న వాటిలో 3,281 కేసులను పరిష్కరించామన్నారు. వాటిలో క్రిమినల్ కేసులు 3012, వాహన ప్రమాద బీమా కేసులు 120కేసులు పరిష్కరించి ఆరు కోట్ల రూపాయల నష్టపరిహారం బాధితులకు అందించేలా రాజీచేశామన్నారు. వీటిలో రెండు కేసులలో 70 లక్షల రూపాయలు, 50 లక్షల రూపాయలను పరిహారంగా వారి కుటుంబ సభ్యులకు అందేలా చేశామన్నారు. 149 సివిల్ కేసులు పరిష్కారం జరిగాయన్నారు. కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులు 3,281 పరిష్కారం కాగా, అదనంగా 121 ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించామన్నారు.కొన్ని కోర్టుల్లో ఇంకా కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు. రెండవ అదనపు జిల్లా జడ్జి ఇందిరా ప్రియదర్శిని, 5వ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వివిఎస్ మురళీకృష్ణ, 8వ అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కెకె బులికృష్ణ, అదనపు సీనియర్ సివిల్ జడ్జి సాయితేజ, ప్రభుత్వ న్యాయవాది బిజె రెడ్డి, ఏవి నారాయణ, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం పాల్గొన్నారు.

● భీమడోలు: కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 87 కేసులు పరిష్కరించినట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్ పర్సన్, సివిల్ కోర్టు జడ్జి ఎస్ ప్రియదర్శిని నూతక్కి తెలిపారు. భీమడోలు, దెందులూరు,ద్వారకాతిరుమల మండలాలకు సంబంధించిన కేసులు పరిష్కరించామన్నారు.

● చింతలపూడి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఆధ్వర్యంలో శనివారం జరిగిన మెగాలోక్ అదాలత్‌లో 97కేసులు పరిష్కరించినట్టు జూనియర్ సివిల్ జడ్జ్ జి.హెచ్.మధుబాబు తెలిపారు.

● జంగారెడ్డిగూడెం: కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 169 కేసులు పరిష్కరించినట్టు న్యాయమూర్తి కిశోర్ కుమార్ తెలిపారు. బెంచ్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ఎం.జి.ఆర్, బార్ అధ్యక్షుడు జి.ఎస్.ఆర్.మూర్తి పాల్గొన్నారు.

●భీమవరం క్రైం: మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, మూడవ అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయ అధికారి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన సివిల్, క్రిమినల్ కేసులు రాజీకి అన్ని కోర్టుల ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో 24 సివిల్ కేసులు, 625 క్రిమినల్ కేసులు, 13 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించామని కలిపారు. న్యాయవాద సభ్యులుగా పి.విజయ కుమార్‌బాబు, ఎ.విజయలక్ష్మి, ఎ.నటరాజ్, ఎ.శివాజీ రాజు, క్యాస్ట్రో, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి యోహాన్(న్యూటన్) పాల్గొన్నారు.

●పాలకొల్లు అర్బన్: పాలకొల్లు కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 31 కేసులు రాజీ చేసినట్టు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి రొక్కం వరలక్ష్మి తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.వి.సూర్య నారాయణ, ప్రభాకర్, చంటి యోహన్, పి.పూర్ణ రవి చంద్ర, శ్రీనాధ్‌ల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● తణుకు: తణుకు కోర్టు ప్రాంగణంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 650 కేసులు రాజీ చేసినట్టు నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. శనివారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 23, క్రిమినల్ కేసులు 605, ప్రీ లిటిగేషన్ కేసులు 22ఉన్నాయని చెప్పారు. న్యాయమూర్తులు కె.కృష్ణ సత్యలత, సాయిరాం పోతర్లంక, బెంచ్ మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేశ్ పాల్గొన్నారు.


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఆలయానికి నిప్పుపెట్టిన వ్యక్తి అరెస్టు

నరసాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి):మొగల్తూరు గ్రామంలో ఐదు రోజుల క్రితం వెలుగు చూసిన నడివీధి ముత్యాలమ్మ ఆలయ దగ్ధం కేసును పోలీసులు ఛేదించారు. గ్రామానికి చెందిన తోట శ్రీను ఈ దుశ్చర్యకు పాల్పడినట్టు పశ్చిమ గోదావరి జిల్లా ఏఎస్పీ భీమారావు చెప్పారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. ఇటీవల కమిటీ సభ్యులు సిమెంట్ దిమ్మలతో షెడ్ వేయాలని నిర్ణయించారు. దీనిని తోట శ్రీను వ్యతిరేకించాడు. అయితే కమిటీ సభ్యులు ఏకాభిప్రాయంతో పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. ఇది నచ్చక శ్రీను 8వ తేదీ రాత్రి మద్యం మత్తులో ఆలయానికి నిప్పుపెట్టడంతో పోలీసులకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టగా శ్రీను మీద అనుమానం వచ్చి విచారించగా తానే నిప్పు పెట్టినట్టు ఒప్పుకున్నాడని ఏఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన పాలకొల్లు సీఐ శ్రీనివాస్, ఎస్.ఐ.లు వాసు, నాగలక్ష్మి, పృథ్వీ, ఇతర సిబ్బందికి అవార్డులతో అభినందించారు. సమావేశంలో డీఎస్పీ శ్రీవేద పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో నాలుగు గొర్రెలు మృతి



కామవరపుకోట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శనివారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షాలకు, గాలివానలకు కామవరపుకోట మండలం మంకినపల్లి సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఆ వైపు వెళ్తున్న నాలుగు గొర్రెలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయని గొర్రెల యజమాని సర్వేశ్వరరావు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో తన నాలుగు గొర్రెలు మృతి చెందాయని, నష్టపరిహారం అందించాలని సర్వేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు.

నీటిలో మునిగి ఇద్దరు బాలల మృతి

» వేర్వేరు చోట్ల ఘటన » శోకసంద్రంలో కుటుంబ సభ్యులు


మోహిత (ఫైల్)

అత్తిలి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అత్తిలి శివారు రామన్నపేటలో సప్పా మోహిత(2) అనే బాలిక మంచినీటి చెరువులో పడి మృతి చెందింది. ఆ బాలిక తన తల్లి లీలతో కలిసి అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేసింది. ఇంటి సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉండడంతో బాలికను కేంద్రానికి తల్లి అలవాటు చేస్తోంది. బాలిక తల్లి చేయి కడుక్కోవడానికి వెళ్లగా బాలిక ఎదురుగా ఉన్న చెరువు వద్దకు వెళ్లి పడిపోయింది. ఆ సమయంలో అంగన్‌వాడీ కార్యకర్త ఫేస్ యాప్ తీసుకో వడానికి తల్లుల వద్దకు వెళ్లింది. అదే సమయంలో సహాయకురాలు పిల్లలకు భోజనం పెడుతోంది. బాలిక ఇంటికి వెళ్లిందని భావించిన తల్లి పక్కనే ఉన్న ఇంటి వద్దకు వెళ్లగా కనిపించలేదు. చెరువు వద్దకు రాగా కొన ఊపిరితో బాలిక కనిపించింది. తణుకు ఆసుపత్రికి తరలించగా బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

పంట కాల్వలో పడి మూడేళ్ల బాలుడి మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాద బల్లకట్టు వద్ద శనివారం విషా దం చోటు చేసుకుంది. ఇంటికి సమీపంలో ఆడుకుంటూ మూడేళ్లబాలుడు నిడదవోలు పంట కాల్వలో పడి మృతి చెందాడు. అయితే గుర్తించక తల్లి దండ్రులు, స్థానికులు రెండు గంటల పాటు బాలుడు కోసం బల్లకట్టు ప్రాం తంలో వెతికారు. చివరికి కాల్వ గట్టు దగ్గర చూడగా... గుర్రపు డెక్కలో కూరు కుపోయి ఉండటాన్ని గుర్తించారు. బాలుడు తండ్రి ఎస్.భరత్ చిరు వ్యాపారి.

రూ.15.67 లక్షల విలువైన ఎరువులు సీజ్


ఎరువులు పరిశీలిస్తున్న అధికారులు

ఏలూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా శనివారం పలుచోట్ల ఏకకాలంలో దాడులు నిర్వహించి రూ.15 లక్షల 67వేల 650 విలువైన ఎరువులను సీజ్ చేశారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం సీతానగరంలో గణేశ్ ట్రేడర్స్, లక్ష్మీట్రేడర్స్, పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడలో విజయలక్ష్మి మెన్యూర్, జనరల్ స్టోర్స్, సద్గురు ఆగ్రోకెమికల్స్‌ల్లో తనిఖీలు చేయగా, గణేష్, లక్ష్మి ట్రేడర్స్‌ల్లో 15లక్షల 67వేల 650 విలువైన 64.500 టన్నుల ఎరువుల వ్యత్యాసాన్ని గుర్తించి సీజ్ చేశారు. షాపుల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ డీఎస్పీ సింగలూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ పి.శివరామకృష్ణ, విజిలెన్స్ ఏవో జి.మీరయ్య, తహసీల్దార్ బి.కన్యాకుమారి, విజిలెన్స్ సి.హెచ్.రంజిత్ కుమార్, కె.నాగరాజు, సీతారాములు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



కలిదిండి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరులోకి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. కలిదిండి మండలం చిన తాడినాడ పల్లిపాలేనికి చెందిన కొల్లి వరప్రసాద్(42) శనివారం ఉదయం ఉప్పుటేరులోకి నాటు పడవపై చేపల వేటకు వెళ్లాడు.చేపల కోసం వల వేయగా చిక్కుకుపోవడంతో బలవంతంగా వలను లాగేప్రయత్నం చేయగా ప్రమాదవశాత్తు ఉప్పుటేరులో పడి మునిగి మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే వరప్రసాద్ ఆకస్మాత్తుగా మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ పోస్టులు సాధించడంపై ఎంపీ హర్షం

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత శిక్షణ తీసుకుని 36మంది ఉపాధ్యాయులుగా ఎంపికవడం పట్ల ఎంపీ మహేశ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సి.ఆర్.రెడ్డి డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఎంపీ మహేశ్ కుమార్ మాట్లాడుతూ ఎప్పుడు ప్రజాసేవలో ముందుండే ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ నిరుద్యోగులకు ఉచిత శిక్షణనిచ్చి వారిని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంలో కీలకపాత్ర వహిస్తున్న చింతమనేనిని అభినందించారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులిచ్చి మాట నిలబెట్టుకున్నారన్నారు.

మాధురికి నగదు ప్రోత్సాహం

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన మహిళా జాతీయ ఫుట్‌బాల్ విభాగంలో ప్రతిభ చూపిన అనపర్తి సాయి మాధురిని మాతృదేవోభవ ట్రస్ట్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ నిర్వాహకులు కే.సత్యనారాయణ, వై.ఆనంద్‌నాయుడు, ఎస్.కస్తూరిరావులు రూ.5 వేలు ప్రోత్సాహకం అందించారు.



చెక్కు అందజేస్తున్న దృశ్యం

15 నుంచి పశువులకు వ్యాక్సిన్లు

దెందులూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. శనివారం దెందులూరు క్యాంప్ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆకుల దుర్గ జ్యోతితో కలిసి గాలి కుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ కార్యక్రమం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. పశు సంవర్ధక శాఖ అధికారులు జ్యోతి, హరికృష్ణ, తారక్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు పశువుకు ఉచిత టీకాలు వేయనున్నట్టు తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లుబాబు), మోతుకూరి నానిబాబు, యలమర్తి శ్రీనువాస్, గారపాటి కొండయ్య చౌదరి ఉన్నారు.

● భీమడోలు: పశువుల గాలికుంట వ్యాధి నివారణకు పాడి రైతులు ముందస్తు టీకాలు వేయించాలని భీమడోలు పశు వైద్యశాల ఏడీ ఇక్కుర్తి సాయి రమేశ్ సూచించారు. వైద్యశాలలో గాలికుంటు వ్యాధి నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సాయి రమేశ్ మాట్లాడుతూ వైద్యశాలల్లో టీకాలు వేస్తామని సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఎల్ఎస్ఎ శ్రీహరి కృష్ణ, డీఈవో చలపతిరావు, ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి):ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని, అవి ప్రజలకు చేరువ అయ్యేలా కృషి చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు కూడా పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ కమిషన్, ఐఆర్, పాత బకాయిలు విడుదల చేయాలని కోరారు. క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించి ఒక రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నవంబరులో ఇఫ్టూ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి):నగరంలో నవంబరు 1 నుంచి 4వ తేదీ వరకు జరగనున్న ఇఫ్టూ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు, జనరల్ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఇఫ్టూ నాయకులు బద్దా వెంకట్రావు, ఎర్రా శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు. శనివారం ఇఫ్టూ కార్యాలయంలో శిక్షణ తరగతులకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఇఫ్టూ నాయకులు మీసాల వెంకటరమణ, మంగరాజు రాము, కోరాడ అప్పారావు, విజయ్, పడాల అప్పలరాజు, నూకరాజు దుర్గారావు, త్రినాథ్, సింభహాచలం, దావీదు, రెడ్డి రమణ, గడసాల రమణ, మజ్జి శ్రీను ఉన్నారు.

బీసీ సంఘ గౌరవాధ్యక్షుడిగా వీరంకి త్రినాథరావు



ఏలూరు రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్రావు సూచనలు మేరకు సంఘం ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షుడిగా వీరంకి త్రినాథరావును నియమించినట్లు ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్నేపల్లి తిరుపతి తెలిపారు. శనివారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఈమేరకు నియామక పత్రాన్ని అందజేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన వీరంకి త్రినాథరావు మాట్లాడుతూ బీసీల కమిటీలను నియమిస్తామన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : ఎంపీ

ఏలూరుటూటౌన్/టి.నర్సాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. ఎంపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీలు స్వీకరించిన మహేశ్ అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కొవ్వూరు జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెం నుంచి ద్వారకాతిరుమల, ఏలూరు, కైకలూరు, కత్తిపూడి మీదుగా నూతన జాతీయ రహదారికి రూప కల్పన చేస్తున్నామన్నారు. త్వరలో కేంద్రానికి ప్రతిపాదనలు పంపి ఆమోదింపజేయడానికి కృషి చేస్తామన్నారు. టి.నర్సాపురం యర్రచెరువు ప్రాంతంలో నివాసముంటున్న నిరుపేదలకు శాశ్వత ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రవి వినతిపత్రం శనివారం అందజేశారు. ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని రవి తెలిపారు.

ఎస్పీ కార్యాలయానికి బొలేరో వాహనం అందజేత



వాహనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్/ఏలూరు క్రైం,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కార్యాలయానికి బొలేరో వాహనాన్ని బహూకరించారు. ఎమ్మెల్యే బడేటి చంటి బొలేరో వాహనాన్ని ఎస్పీ ప్రతాప్ శివకిషోర్‌కు అందించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు వాహనాలు ఎంతో అవసర మని, అడిగిన వెంటనే వాహనాన్ని బహూకరించిన గుప్తా ఫౌండేషన్ ప్రతినిధు లను అభినందించారు. ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో సహకరిస్తున్న ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు. వాహనాన్ని బహూకరించిన గుప్తా ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

కైకలూరు పంచాయతీలో అవినీతి వ్యవహారం..

ఆరుగురి సస్పెన్షన్..!

(5వ పేజీ తరువాయి)

పక్కదారి పట్టించినట్టు విచారణలో తేలినప్పటికీ ఇంకా సస్పెన్షన్ చేసిందిలేనిదీ తెలియదు. ఇప్పటికే సర్పంచ్ నవరత్నకుమారిని పదవి నుంచి సస్పెండ్ చేశారు. అవినీతికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ రెండు రోజుల క్రితమే ఆర్డర్ వచ్చినప్పటికీ ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచుతు న్నారు. చేసిన తప్పులు కప్పిపుచ్చాలనే ఉద్దేశంతోనే ఉన్నతాధికారులు ఇప్పటి వరకూ సస్పెండ్ ఆర్డర్లను బయటపెట్టకుండా ఉంచారన్న విమర్శలు విన్పిస్తున్నాయి.

కుండపోత


(5వ పేజీ తరువాయి)

ఫాల్ స్లూయిజ్ 23గేట్ల నుంచి గోదావరిలోకి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోలవరం మెయిన్ బజార్‌లో వర్షపునీరు నిలిచింది. లింగపాలెం,చింతలపూడి, ముసునూరు,పెదపాడు మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కామవరపుకోట మండలం తడికలపూడి నుంచి ఆడమిల్లికి వెళ్లే రహదారిలో చెట్లు విరిగి రోడ్ల మీద పడడంతో రాకపోకలకు విఘాతం ఏర్పడింది. తడికల పూడి సొసైటీ చైర్మన్ తూతా బాలాజీకుమార్ కార్యకర్తలను సమీకరించి రోడ్లపై పడిన చెట్లను తొలగించే చర్యలు చేపట్టారు. ఆగిరిపల్లి-నూగొండపల్లి మధ్యగల కుంపెనీ వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆగిరిపల్లి నుంచి నూగొండపల్లి, పిన్నమరెడ్డిపల్లి, రాజ వరం, ఎస్‌పేట గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆగిరిపల్లి- తోటపల్లి మధ్య వాగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. పెదవేగి మండలంలో భారీ వర్షంతో ఉద్యానపంటల్లో వరదనీరు ముంచెత్తి, పంటపొలాలు ఎర్రనీటితో కనిపించాయి.

జలాశయాలకు వరదనీరు

జంగారెడ్డిగూడెం/చింతలపూడి:మండలాల్లోని శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి వరద చేరుతోంది. శనివారం రాత్రి 9గంటలకు 11,600 క్యూసెక్కులు జలాశయంలోకి చేరుతుండగా 3,700 క్యూసెక్కులు దిగువకు విడుదల చేసినట్టు ఇరిగేషన్ డీఈ కె.సునీత తెలిపారు. జలాశయం నీటి సామర్థ్యం 83.50 మీటర్లు కాగా శనివారం రాత్రికి 82.65 మీటర్లు నీరు జలాశయంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. జల్లేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తూ వరద నీరంతా జలాశయంలోకి చేరుతోంది. చింతలపూడి సమీపంలోని తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరద వచ్చి చేరుతుంది. శనివారం సాయంత్రం ఆరు గంటలకు ఎగువ నుంచి 1400 వందల క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా దిగువకు రెండు వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నీటిమట్టం 348.24 అడుగులు ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ ఏఈ లాజర్‌బాబు తెలిపారు.

ఏలూరులో తమ్మిలేరు ఉధృతి



ఏలూరు క్రైం: ఏలూరులో శనివారం ఉదయం నుంచి తమ్మిలేరు పెరుగుతూ వస్తోంది. శనివారపుపేట కాజ్‌వేకు ఆనుకుని ప్రవహించడంతో ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇంకో వైపు కొత్త బస్టాండ్ సమీపంలోని లోబ్రిడ్జి (రైలు పట్టాలు కింద) రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. వరద ఉధృతి మరింత పెరిగితే ఆదివారం ఉదయానికి మరోమారు శనివారపుపేట కాజ్‌వేపై నీటి ప్రవాహం ప్రవహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



నగరంలో కుంభవృష్టి..

ఏలూరుసిటీ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఏలూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో శనివారం కుండపోత వర్షం కురిసింది. ఏలూరుతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు తమ్మిలేరు పొంగి పొర్లింది. ఏలూరులోని పవర్‌పేట ప్రాంతంలో రహదారులపై ఉధృతంగా వరద ప్రవహించి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎక్కడికక్కడ డ్రెయినేజీలు నిండిపోవడంతో మురుగు రోడ్లపైకి వచ్చింది.



వర్షంలో తడుస్తూ వాహనాలపై వెళ్తున్న ప్రజలు











వరదను కట్టడి చేయండి

కలరాయనగూడెం పాఠశాలలోకి వర్షపు నీరు

చర్యలు చేపట్టాలంటూ తల్లిదండ్రుల ఆవేదన



స్కూల్ ఆవరణలో నిలిచిపోయిన వరద

లింగపాలెం , సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శనివారం కురిసిన భారీ వర్షానికి లింగపాలెం మండలం కలరాయనగూడెంలోని హైస్కూల్ నీట మునిగింది. చినుకు వర్షం కురిస్తే చాలు ఈ పాఠశాల ఆవరణ మొత్తం వరదతో మునిగిపోతోంది. దీంతో వరదనీరు తరగతి గదులలోకి చేరడంతో గదులు మొత్తం బురదగా మారుతున్నాయి.. పాఠశాల ఎదురుగా ఉన్న కాలువను కొందరు వ్యక్తులు ఆక్రమించి పూడ్చివేయడంతో చెతతో కూడిన వరద పాఠశాలలోకి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై విద్యాశాఖ అధికారులకు పలుమార్లు విన్నపించినా పట్టించుకోవడంలేదంటూ గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఈ మురుగు కారణంగా విద్యార్థులు వ్యాధుల బారిన పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం..

భీమడోలు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో వర్షాలకు డ్రైనేజీలు పొంగి పొర్లాయి. రోడ్డుపైకి నీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు. భీమడోలులోని భీమడోలు, ద్వారకాతిరుమలకు వెళ్ళే మినిబైపాస్ రోడ్డు వర్షాలకు ధ్వంసమై గోతులుగా మారింది.ఈ రోడ్డుకు సరైన డ్రెయినేజీ లేకపోవడంతో తరచు రోడ్డు ధ్వంసమై గోతులతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ రోడ్డుకు తూతూ మంత్రంగా మరమ్మతులు చేసిన అధికారులు, ప్రజా ప్రతినిధులు చేతులు దులుపుకున్నారు.

రైతులకు సేవలందించండి

చింతలపూడి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందిస్తూ సొసైటీలను అభివృద్ధి పథంలో నడపాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ఆర్‌కే పంక్షన్ హాల్లో చింతలపూడి సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో 20 సొసైటీలకు త్రిసభ్య కమిటీలు వేయడం జరిగిందని, ఈ కమిటీలు రైతులకు సకాలంలో రుణాలు ఇచ్చి అభివృద్ధి చేయాలన్నారు. నియోజకవర్గ టీడీపీ మాజీ కన్వీనర్ జె.ముత్తారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో రానున్నాయని వాటికి అందరూ సమాయత్తం కావాలన్నారు. సొసైటీ చైర్ పర్సన్ తిరిమిల్లి రామారావు, సభ్యులు ఎన్.నాగేశ్వరరావు, సి.హెచ్.శ్రీనివాసరావులచే ప్రమాణ స్వీకారం చేయించారు. దాసరి చంద్రశేషు, ఆది ధర్మారావు, టి.చంద్రశేఖరరెడ్డి, ఎస్.ఎస్.ఎన్.గాంధీ, కొత్తపూడి శేషగిరి, టి.అప్పారావు, ధర్మరాజు, కె.కిషోర్, విజయ కుమారి, చీదరాల మధుబాబు పాల్గొని మాట్లాడారు.



మందులు అందజేస్తున్న వైద్యుడు శ్రీకృష్ణ

ఉచితంగా వైద్య సేవలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ ఆర్థోపెడిక్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో శనివారం ఆసుపత్రి ప్రాంగణంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తూ పేదలకు వైద్య సాయం అందిస్తున్నట్టు ప్రముఖ ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీకృష్ణ తెలిపారు. ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలతో పాటు, విలువైన వైద్య సేవలతో పాటు, విలువైన రక్తపరీక్షలు చేస్తున్నామన్నారు. ప్రతినెలా రెండో శనివారం ఉచిత వైద్య సేవలతో పాటు మందులు అందజేసినట్టు కృష్ణ తెలిపారు.

శ్రీవారి సేవలో తూ.గో. జిల్లా కలెక్టర్ కీర్తి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని తూర్పు గోదావరి జిల్లా నూతన కలెక్టర్ చేకూరి కీర్తి శనివారం సందర్శించారు.ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆ తరువాత ఆలయ ముఖ మండపంలో అర్చకులు ఆమెకు స్వామివారి శేషవస్త్రాన్ని అందించి వేదాశీర్వచనం చేశారు. ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు.

సోలో మ్యూజిక్ విజేతకు సత్కారం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): దూబచర్లలో ఈనెల 11, 12న జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో దేవస్థానం పాఠశాల విద్యార్థి బి.పవన్ వెంకట్ పోలో మ్యూజిక్(సన్నాయి)లో ప్రథమ బహుమతి పొందాడు. ఇతన్ని దేవస్థానం చైర్మన్ రాజా ఎస్.వి.సుధాకరరావు అభినందించారు. అలాగే ఈవో, పాఠశాల కరస్పాండెంట్ ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి విద్యార్థికి శాలువాకప్పి సత్కరించారు. త్వరలో రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభచూపాలని కోరారు.

మాజీ బార్ అధ్యక్షుడు మూర్తి మృతి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది తాతవోలు సూర్యనారాయణ మూర్తి(64)హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అనారోగ్యంతో శనివారం తెల్లవారు జామున మృతి చెందారు. సాయంత్రం మూర్తి భౌతికకాయాన్ని పట్టణంలోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. ఆయన భౌతిక కాయానికి స్థానిక సివిల్ కోర్టు జడ్జి సి.హెచ్.కిషోర్ కుమార్ సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సర్వీసు రోడ్లు నిర్మించాలి

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీసు రోడ్లు నిర్మించాలని భూనిర్వాసిత రైతులు ఎంపీ మహేశ్ కుమార్‌ను కోరారు. ఎంపీ కార్యాలయంలో శనివారం ఎంపీ మహేశ్‌కు వినతిపత్రం సమర్పించారు.ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వీసు రోడ్లు నిర్మించకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.దాదాపు 31 గ్రామాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే వెళ్తుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సర్వీసు రోడ్లులేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ మహేశ్ కేంద్ర ప్రభుత్వం, హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి సర్వీసు రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు.

మాకు బకాయిలు చెల్లించండి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల్లో ఉద్యోగులుగా 30 నుంచి 35 ఏళ్ల పనిచేసి పదవీ విరమణ అనంతరం తమకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణం చెల్లించాలని ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.కామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కెనాల్ రోడ్డులోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కె.కామయ్య మాట్లాడుతూ 2020 నుంచి ఇప్పటి వరకు 550 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారని, వీరికి రావలిసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఏరియర్స్ నేటికీ చెల్లించే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 65 మంది విశ్రాంత ఉద్యోగులు తమ రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందకుండానే చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

శక్తియాప్‌పై పోలీసుల అవగాహన

ఏలూరు క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని టీమ్ సభ్యులు మహిళలకు వివరించారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో శక్తిటీమ్ సభ్యులు ఏలూరు ఆర్‌ఆర్‌పేటలో ఉన్న బీసీ బాలికల వసతి గృహంలో శనివాయం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏలూరు నగరంలోని పలు ప్రాంతాల్లో మహిళలకు, యువతులకు ఈ యాప్‌పై అవగాహన కల్పించారు.

నూరుద్దీన్‌కు ఘన సన్మానం

నిడమర్రు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ఆక్వా డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్‌గా ఇటీవల నియామకమైన మహ్మద్ నూరుద్దీన్(మజీద్)ను స్థానికులు, ఎన్‌ఆర్‌ఐలు ఘనంగా సత్కరించారు. శనివారం క్రొవ్విడిలో నూరుద్దీన్ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో సౌదీ అరేబియా నుంచి మహ్మద్ సాజిద్, మీరా షరీఫ్‌లు ఆయనను ఘనంగా పూలమాలతో దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. టీడీపీ మండలాధ్యక్షులు, స్టేట్ లైవ్‌స్టాక్ కార్పొరేషన్ డైరెక్టర్ ముత్యాల స్వామి అధ్యక్షత వహించారు. టీడీపీ మైనార్టీ విభాగం నాయకులు మహ్మద్ ఇక్బాల్, మహ్మద్ అబ్దుల్ జబ్బార్, అంజుమాన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి రహేతుల్లా షరీఫ్, మహ్మద్ హుస్సేన్ షరీఫ్, ఆరేవుల్ రెహ్మాన్, ఇమామ్ మహ్మద్, తోట అప్పారావులు పాల్గొన్నారు.



మజీద్‌ను సన్మానిస్తున్న ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నాయకులు



ప్రాథమిక చికిత్సపై డెమో నిర్వహిస్తున్న విద్యార్థులు

అత్యవసర వైద్యంపై విద్యార్థినుల డెమో

దెందులూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాలను రక్షించ వచ్చని దెందులూరు బి.ఆర్.డి. నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు.శనివారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా నర్సింగ్ చదివే విద్యార్థులతో ప్రథమ చికిత్స రోగికి ఎలా అందించాలనే అంశంపై డెమో నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

చింతలపూడి/లింగపాలెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధి దారులకు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ శనివారం అందించారు. ఇందులో పాశ్వానగరానికి చెందిన అబ్బాదాసరి జ్యోతికి, లింగపాలెం మండలంలోని కె.గోకవరం గ్రామానికి చెందిన బందెల వెంకటేశ్వరరావుకు, మల్లెంపల్లి చిట్టిమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. సర్పంచ్ యలమంచి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ మండలపు నాని, ముప్పా బాబూరావు, తొమ్మండ్రు రవితేజ, తొమ్మండ్రు మల్లయ్య, ఉదయ కిరణ్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకోండి : డీఎస్పీ

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడికి గురవుతున్న జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. శనివారం మండలంలోని వేగవరం సమీపంలో ఏపీయుడబ్ల్యూజే ఆధ్వర్యంలో వేణు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.వేణు వైద్య పరీక్షలు చేసి సలహాలు సూచనలు ఇచ్చారు. సిటీ కేబుల్ ఎండీ.పాలపర్తి శ్రీనివాస్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు డివి.భాస్కరరావు, కెవి.రమణారావు, కె.వెంకట్, సీనియర్ జర్నలిస్టులు వి.శ్రీనివాస్, పి.సాయి కుమార్, నందూరి కిశోర్, చందు, బాలసుబ్రహ్మణ్యం, ఐతా సురేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): దొండపాడు పరివర్తన్ బధిరుల పాఠశాలలో ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ(యు.ఈ.టీ.ఎస్) 38వ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ జి.వి.వి. సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 38 సంవత్సరాలుగా దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తోందని కొనియాడారు. సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సొసైటీ ద్వారా వివిధ మార్గాల ద్వారా దివ్యాంగులకు అనేక రకాల సేవలను అందించడంలో ముందుందని తెలిపారు. పాఠశాల ప్రత్యేక డీఎడ్ కళాశాల, డి.డి.ఆర్.సి. సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

ఉత్సాహంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తల కవాతు

ఏలూరు,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు ఏలూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఘోష్(బ్యాండ్) శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన శిక్షార్థులు, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు, ఏలూరు వన్‌టౌన్ పరిధిలో కవాతు నిర్వహించారు. కుండిబొమ్మ సెంటర్, గడియారం స్తంభం, కన్నయ్య పార్కు, పెద్ద వంతెన మీదుగా కవాతు సాగింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన బ్యాండు వాదకులతో పాటు ఇతర జిల్లా, విభాగ్, రాష్ట్ర స్థాయి ఆర్ఎస్ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో సమాజానికి చేటు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శనివారపుపేట శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో శనివారం గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లెడ్జ్ వీకెండ్ టు ఎండ్ చైల్డ్ మ్యారేజ్‌పై అనే అవగాహన కార్యక్రమాన్ని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ క్రమంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలపై భక్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు హయగ్రీవ చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

1991 యాప్‌లో సీఆర్ఆర్ భాగస్వామ్యం

పెదపాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విజయవాడ సిటీ పోలీసు శాఖ వారికి హెల్త్‌ఫస్ట్ 1991 అనే యాప్ రూపకల్పనలో పెదపాడు మండలం వట్లూరు సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు భాగస్వాములయ్యారని కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు తెలిపారు. విజయవాడ పోలీసు కమీషనర్ ఎస్వీ రాజశేఖరబాబు సూచనల మేరకు పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రత దృష్ట్యా హెల్త్‌ఫస్ట్ యాప్‌ను రూపొందించారన్నారు. ఈ యాప్ అభివృద్ధిలో 1991 బ్యాచ్ విద్యార్థులు భాగస్వాములు అయ్యారన్నారు.

వేంకటేశ్వర స్వామికి పూజలు

పోలవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ శ్రీసుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి ఎక్కువైంది. పోలవరం,గోపాలపురం, తాళ్లపూడి మండలాల నుంచి భక్తులు కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మూడువేల మంది భక్తులు స్వామికి పూజలు నిర్వహించినట్టు ఆలయార్చకులు ఎస్.వెంకట్రామ శర్మ తెలిపారు.

భారీగా అన్నదానం..

పోలవరంలోని ముప్పినిశెట్టివారి వీధిలో వినాయకుడి ఆలయ ప్రాంగణంలో గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా శనివారం భారీ అన్నదానం జరిగింది.సుమారు రెండువేల మందికి పైగా భక్తులు పాల్గొన్నట్లు ఉప సర్పంచ్ కోరశిక శ్రీనివాస్, రాచమళ్ల రాజేశ్, బెజవాడ గోపి, మంగిన రాము, కంభంపాటి గోపి తెలిపారు.

ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ

దెందులూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చల్లచింతలపూడి పంచాయతీకి నిధులు మంజూరు చేయించారని టీడీపీ మండల కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సత్యనారాయణ, రాముగౌడ్ కలిసి భూమి పూజ నిర్వహించారు. మాజీ సర్పంచ్ ముమ్మడి మోహన్‌రావు, మొదుగుమూడి రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్ పుసులూరి ప్రసాద్, తూంపాటి అంజనేయులు, యర్రంశెట్టి నాగరాజు ఉన్నారు.

అధ్వానంగా రహదారులు

కామవరపుకోట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున వచ్చి గాలివానలకు అంతంత మాత్రంగా ఉన్న గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గ్రామంలో డ్రెయినేజి వ్యవస్థ సజావుగా లేకపోవడంతో వర్షపునీరు, మురుగునీరు కలయికతో రోడ్లన్నీ చిద్రమయ్యాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.

శ్రీవారికి విశేష పూజలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భాద్రపదమాసం శనివారం కావడంతో స్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు, వేంకట పవన్ కృష్ణమాచార్యులు స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహించి అనంతరం విశేష హారతులిచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో నల్లూరి సతీశ్ కుమార్, సిబ్బంది గంగాధరరావు, శ్రీనివాసరావుల బృందం భక్తులకు తగు సేవలందించారు.

దాకారపు కృష్ణకు ఎక్సలెన్సీ అవార్డు



జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్, సామాజిక వేత్త దాకారపు కృష్ణ ప్రతిష్ఠాత్మకమైన రాజ్ న్యూస్ తెలుగు బిజినెస్ ఎక్సలెన్సీ అవార్డు ఎంపికయ్యారు. ఏటా పలు రంగాలు, అంశాలలో సమాజానికి సేలందిస్తున్న వారిని గుర్తించి ఈ అవార్డును అందజేస్తారు. 17వ తేదీన విజయవాడలో మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా అందుకోనున్నట్టు దాకారపు కృష్ణ తెలిపారు.

82 మందికి ఆయుర్వేద వైద్యం

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యం ద్వారా ఎటువంటి దీర్ఘకాలిక వ్యాధులైనా అదుపులోకి వస్తాయని ఆయుష్ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ బి.వి.ఎం. నగేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో 82 మంది వైద్య సేవలు పొందారు. వారితో కౌన్సెలింగ్ నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. లయన్స్ క్లబ్ నాయకులు రామారావు, సురేశ్ కుమార్,పండరీనాథ్, అజయ్‌కుమార్, లోకేశ్‌లు సేవలు అందించారు.

ఘనంగా లక్షతులసీ పూజ

నిడమర్రు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కొల్లేటి తిరుమలగా ప్రసిద్ధి చెందిన నిడమర్రు బాలవెంకటేశ్వర స్వామి ఆలయంలో భాద్రపద మాసం షష్టి సందర్భంగా శనివారం లక్ష తులసీ దళాలతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నాయుడు దొరబాబు దంపతులు పర్యవేక్షణలో సుమారు 2వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా అన్నసమారాధనలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో శనివారం కుండీ సెంటర్, బావిశెట్టివారిపేటలోని రామాలయం వద్ద ఉత్సవ నిర్వాహకులు భక్తులకు శనివారం మహా అన్నప్రసాద వితరణను నిర్వహించారు.ఈ సందర్భంగా తొలుత స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కుంకుమార్చనలు నిర్వహించి అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని బిజెపి నాయకులు గాది రాంబాబు, నాగం శివ బృందం ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు ఒక వైపు భారీ వర్షం కురుస్తున్నా భక్తులు తరలి వచ్చి అన్నప్రసాద వితరణలో పాల్గొనడం విశేషం.

కుమ్మరగట్టులో ఆలయ నిర్మాణం ప్రారంభం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్ముగూడెం శివారు కుమ్మరగట్టు గ్రామంలో శ్రీరమా సహిత వీర వెంకట సత్యన్నారాయణ స్వామి ఆలయ నిర్మాణం ప్రారంభమైంది. ఆలయ కమిటీ పెనుగుర్తి సోంబాబు, కోనూరి నరేశ్, కొండేపాటి రామకృష్ణ మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలన్నారు. ఎంతో నిబద్ధతతో ఆలయ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు.

పలు కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

ఏలూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు కార్పొరేషన్ల డైరెక్టర్ల పదవులకు ఉమ్మడి జిల్లాల్లోని కూటమి నేతలకు చోటు దక్కింది. ఏపీ ఇండ ప్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) డైరెక్టర్లుగా భీమవరానికి చెందిన చెన్నమల్ల చంద్రశేఖర్ (టీడీపీ), పాలకొల్లుకు చెందిన కడ్లి గోపాలరావు (టీడీపీ), రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొయ్యలగూడెంకు చెందిన మేడేపల్లి నాగు (బీజేపీ) నియమితులయ్యారు.

నెలరోజుల పాటు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఉచిత టీకా పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి ప్రారంభిస్తున్నట్టు నూజివీడు మండల పశు వైద్యాధికారిణి ఎం. దుర్గాభవాని తెలిపారు. ఈ నెల 15 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెలరోజుల పాటు ఈ టీకా పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తం 25 రెవెన్యూ గ్రామాల పరిధిలో 26,782 పశువులు ఉన్నాయన్నారు. నెలరోజుల్లోపు నూరుశాతం టీకా పంపిణీ కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ సిబ్బంది పూర్తి చేస్తారన్నారు.

చెక్ డ్యామ్ నిర్మించాలని ఎంపీకి వినతి



కలిదిండి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెదలంక తాగునీటి చెరువు వద్ద ఉన్న మంచినీటి కాల్వలో డ్యామ్ నిర్మించాలని కోరుతూ శనివారం ఏలూరులో ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కు కలిదిండి డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, టీడీపీ నాయకులు ముద్దం వెంకన్న, పోకల సుబ్బయ్య వినతిపత్రం సమర్పించారు. తాగునీటి చెరువు వద్ద కాల్వలో డ్యామ్ లేకపోవటంతో మంచినీరు ఉప్పు టేరులోకి వృథాగా పోతుందన్నారు. కాల్వలో మట్టితో అడ్డుకట్ట వేసినప్పటికీ నీటి ప్రవాహం ఉధృతికి కొట్టుకుపోతుందన్నారు. మూల్లంక నుంచి పెదలంక వరకు 7 కిలోమీటర్ల మేర రహదారి గోతులు పడి అధ్వాన్నంగా ఉండటంతో బస్సులు నడవడం లేదని, రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని, నరసాపురం బస్సును పెదలంకకు ఏర్పాటు చేయాలని కోరారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వద్దు : సీఐటీయూ



నూజివీడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసు కోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమా మహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా సీఐటీయూ 13వ మహా సభలు శనివారం నూజివీడులో నిర్వహించారు. తెలుగు సీఐటీయూ పతాకా న్ని సీనియర్ నాయకుడు ఎస్‌ఆర్ హనుమాన్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక లను, ఉద్యోగులను విస్మరించి మాట్లాడుతున్నారన్నారు. ఎన్నికల హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాన్ని అమలుచేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళల కు రూ.1500 ఇస్తామన్న హామీ ఏమైందన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్య క్షుడు రాజా రామ్మోహన్‌రాయ్, జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి ప్రసాద్, జిల్లా కార్యదర్శి జీ.రాజు, నాగమణి, సాయి కిరణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య భద్రతే కూటమి లక్ష్యం : మంత్రి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి సారథి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. నూజివీడులో మంత్రి క్యాంప్ కార్యాల యంలో నియోజకవర్గ పరిధిలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆయన అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య భద్రతకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య బీమాను ప్రభుత్వం అమలు పరిచే దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 52 మంది లబ్ధిదారులకు మంజూరైన 24.49 లక్షల విలువ గల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, నూజివీడు పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు యనమదల శ్రీనివాస్, మల్లిశెట్టి జగదీష్, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు ముసునూరు రాజా పాల్గొన్నారు.

రూ. 2 లక్షలు ఎల్‌వోసీ అందజేసిన మంత్రి సారథి

చాట్రాయి: మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన ఎస్‌కే రెహాన్ అనే 12 ఏళ్ల బాలుడు అనారోగ్యంతో విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబం కావడంతో ఆసుపత్రి ఖర్చులకు డబ్బు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కోటపాడు గ్రామ తెలుగు యువత నాయ కులు బొంతు నరేశ్, యలమంచిలి నాన్నాజీ మంత్రి పార్థసారధి దృష్టికి తీసుకు వెళ్లటంతో వెంటనే మంత్రి రూ. 2 లక్షలు ఎల్‌వోసీ అందజేశారు.

దానగూడెం బాధితులకు అప్పలనాయుడు పరామర్శ



కైకలూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల కైకలూ రులో జరిగిన అల్లర్ల నేపథ్యంలో గాయపడిన వారిని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు పరామర్శించారు. శనివారం కైకలూరు శివారు దానగూడెంలో బాధితుల ఇళ్ల వద్ద వారిని పరామర్శించి దాడికి గల కారణాలను తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. బాధితులకు జనసేన అండగా ఉంటుందని పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు పరామర్శకు వచ్చానని, బాధితులు అందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నామని బాధితులకు భరోసా ఇచ్చారు. ఏలూరు నగర అధ్యక్షుడు వీరంకి అజిత్‌కుమార్, జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, కైకలూరు జనసేన నాయకులు మైలాపల్లి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం నాయకుడు పాతూరికి ఘన నివాళి

ఆగిరిపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకుడు పాతూరి వెంకటేశ్వరరావు 19వ వర్ధంతి సందర్భంగా ఆగిరిపల్లి సుందరయ్యనగర్‌లో ఆ పార్టీ జిల్లా నాయకులు ఎం.శివశంకర్, వెంకటేశ్వర్లు, విజయ్ తులసీరామ్ పాల్గొని పాతూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నూజివీడు నియోజకవర్గ నాయకుడు చలసాని రామారావు, డి.హరనాథ్, టీడీపీ నాయకుడు మదుమల్లి గోపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బీడీ రవికుమార్, వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.

25 టన్నుల యూరియా పంపిణీ

చాట్రాయి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింహారావు పాలెం పీఏసీఎస్‌లో శనివారం ఏవో శివశంకర్, పీఏసీఎస్ చైర్మన్ కట్టా నాగ దుర్గారావు పర్యవేక్షణలో రైతులకు 25 టన్నుల యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నానో యూరియా ఉపయోగాలపై ఏవో రైతులకు అవగాహన కల్పించారు. చనుబండ పీఏసీఎస్‌లో 25 టన్నులు, చాట్రాయి పీఏసీఎస్‌లో 12.5, ప్రైవేటు షాపుల్లో 20 టన్నుల యూరియా ఉన్నదని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(కి.లో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ బోన్ రైతు ధర రూ.475	



నూజివీడు ఎంఅండ్‌కే రహదారిపై నిలిచిన వర్షపు నీరు



చెరువును తలపిస్తున్న మద్వానిగూడెం-పెదలంక ప్రధాన రహదారి

వానొస్తే ఇంతే..

కొద్దిపాటి వర్షానికే రహదారులు మునక

(నూజివీడు - ఆంధ్రజ్యోతి)

పలు రహదారులు వానొస్తే ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. రహదారిపై భారీగా వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. కొద్దిపాటి వర్షం పడిందంటే చాలు నూజివీడు పట్టణంలోని పల్లపు ప్రాంతాలు నీటమునగటం ఖాయం. అలాంటి ప్రదేశాల్లో నూజివీడు ఎమ్‌అండ్‌కే రహదారికి మొగలి చెరువు సమీపంలో రహదారి పల్లంగా ఉండటం, డ్రెయినేజి వ్యవస్థ సైతం ఇబ్బందికరంగా ఉండటంతో వర్షం పడిన సమయంలో వర్షపునీరు మోకాటిలోతుతో రహదారి పై నిలిచిపోతోంది. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రి కొలుసు పార్థసారథి, నూజివీడు పట్టణాన్ని మోడల్‌టౌన్‌గా తీర్చిదిద్దుతానని రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయడంతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజిని ఏర్పాటు చేస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే సదరు హామీలు నెరవేర్చేందుకు ఇంకా సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో ఈ రహదారిని అభివృద్ధి పరుస్తూ కనీసం రెండు నుంచి మూడు అడుగులు ఎత్తు లేపడంతో పాటు డ్రెయినేజీ ఎత్తు కూడా కుదా పెంచితే ముంపు పరిస్థితులను అధిగమించవచ్చు. నూజివీడు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి ఆర్‌అండ్‌పేట ఎన్టీఆర్ విగ్రహం వరకు ఈ రహదారిని అభివృద్ధి పరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్రమంత్రి హోదాలో ఉన్న పార్థసారధి ఆర్‌అండ్‌బి అధికారులతో చర్చించి రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

కలిదిండి: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మద్వానిగూడెం - పెదలంక ప్రధాన రహదారి సుమారు 9 కిలోమీటర్ల మేర పెద్ద గోతులు పడి ధ్వంసమైంది. మూల్లంక నుంచి పెదలంక వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర పడిన గోతుల్లోకి వర్షపు నీరు చేరటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పెదలంక గ్రామానికి రెండు వైపులా ఉన్న ప్రధాన రహదారులు ధ్వంసం కావటంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. గోతులు పడి అధ్వానంగా ఉన్న రహదారులకు మరమ్మతులు చేయాలని పాలకులకు అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గోతులు పడి ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో పాల్గొన్న జనసేన, బీజేపీ నేతలు

అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేయగలరా?

మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుకు జనసేన నాయకుల సవాల్

కైకలూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో ఎలాంటి అవినీతి చేయలేదని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ప్రమాణం చేయాలని కైకలూరు నియోజకవర్గ జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల దూలం నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. శనివారం కైకలూరులో జనసేన, బీజేపీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ దానగూడెం అల్లర్లను ఉపయోగించుకుని రాజకీయంగా లబ్ధి పొందాలని యత్నిస్తున్నారని ఇలాంటి రాజకీయాలకు తెరతీస్తే తగిన మూల్యం చెల్లించు కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇటీవల విలేఖర్ల సమావేశంలో జనసైనికులపై ఇష్టానుసారంగా ఆరోప ణలు చేశారన్నారు. వైసీపీ అధికారంలో ఉండగా కాపు సామాజిక వర్గం పై అనేక ఆక్రమ కేసులు పెట్టారని దెబ్బతిన్న బాధితులపైనే కేసులు కట్టించిన ఘనత ఆయనదేనన్నారు. దళితులు, కాపుల మధ్య గొడవలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. కొల్లి బాబీ దానగూడెం గొడవల్లో ఉన్నట్లు ఆధారాలుంటే బహిర్గతం చేశారు. కైకలూరు వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, జనసేన నాయకులు ఉమారెడ్డి నాగ మల్లేశ్వరరావు, నల్లగోపుల చలపతి, వీరంకి వెంకయ్య, ఏఎన్ బాబు, బీజేపీ నాయకులు పి. శివశంకర్, బోయిడి సురేష్, జి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కైకలూరు లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి



నూజివీడు లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ

రాజీతో ఇరు వర్గాలు గెలిచినట్టే..

కైకలూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీమార్గాన్ని ఎంచుకుంటే ఇరు వర్గాలు గెలిచినట్లేనని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. శనివారం కైకలూరు న్యాయ స్థానాల సముదాయం వద్ద జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 263 కేసులను రాజీ చేశారు. వీటిలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 16, జూనియర్ సివిల్ జడ్జి శివకిరణ్ ఆధ్వర్యంలో 247 పరిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుని కోర్టు సమయాన్ని కాపాడుటతో పాటు కక్షిదారులు ఆర్థిక భారాల నుంచి బయట పడ వచ్చని 15వ అదనపు జిల్లాజడ్జి ఏ.నాగశైలజ అన్నారు. నూజివీడు కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 446 కేసులను పరిష్కరించి రూ. 2 కోట్ల 29 లక్షల 3 వేల 600 నగదును అవార్డు రూపం విధించారు. సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదబాసిం, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, నూజివీడు డీఎస్పీ ప్రసాద్, సీఐ రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రమేష్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు ధైర్యంగా ముందుకు సాగాలి

ముసునూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అవాంతరాలను ఎదుర్కొనేలా ఆడపిల్లలు ధైర్యంగా ముందుకు సాగాలని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి పిలుపు ఇచ్చారు. శనివారం ముసునూరు రక్షణ సైన్యం డిస్ట్రిక్ట్ పరిధిలోని గోపవరం, కాట్రేనిపాడు, పెదపాటివారిగూడెం, చింతలవల్లి, ముసునూరు గ్రామాల ఆడపిల్లలకు మేజర్ పి.దేవకాంతమ్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి బాలికల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కెప్టెన్‌లు డి.పుష్పవతి, బుల్లిపాప, మేజరు ఆర్.కుసుమ కుమారి, డి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.



ముసునూరులో పాస్టర్లు, బాలికల ర్యాలీ



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కిరణ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి సారథి

మంత్రి పరామర్శలు

చాట్రాయి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎమ్మెల్యే గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి శనివారం చాట్రాయి, ముసునూరు మండలాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. చీపురుగూడెం గ్రామంలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన అబ్బూరి కిరణ్ కుటుంబాన్ని మంత్రి పరామర్శించి, వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇదే గ్రామంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త గుండాల సుబ్బారావు కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. అలాగే తుమ్మగూడెంలో అగ్నిప్రమాద బాధితులు మొలుగుమాటి సుకుమార, కృష్ణవేణి కుటుంబాలను మంత్రి పరామర్శించి రూ. 5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. మంత్రి వెంట కూటమి పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కైకలూరు పంచాయతీలో అవినీతి వ్యవహారం..

ఆరుగురి సస్పెన్షన్..!

(5వ పేజీ తరువాయి)

పక్షదారి పట్టించినట్టు విచారణలో తేలినా ఇంకా సస్పెండ్ చేసిందీ లేనిదీ తెలియదు. ఇప్పటికే సర్పంచ్ నవరత్నకుమారిని సస్పెండ్ చేశారు. అవినీతికి పాల్పడిన పంచాయతీ కార్యద ర్శులను సస్పెండ్ చేస్తూ రెండు రోజుల క్రితమే ఆర్డర్ వచ్చినప్పటికీ ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచుతు న్నారు. చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి ఉద్దేశంతోనే ఉన్నతాధికారులు ఇప్పటి వరకూ సస్పెండ్ ఆర్డర్లను బయటపెట్టకుండా ఉంచారన్న విమర్శలు విన్పిస్తున్నాయి.



సింహాద్రిపురం వద్ద రహదారిపై ప్రవహిస్తున్న రామిలేరు వాగు



ఆగిరిపల్లి మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కంపెనీ వాగు

కుండపోత

(5వ పేజీ తరువాయి)

పాల్ స్లూయిజ్ 23 గేట్ల నుంచి గోదావరిలోకి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోలవరం మెయిన్ బజార్‌లో వర్షపునీరు నిలిచింది. లింగపాలెం, చింతలపూడి, ముసునూరు/ పెదపాడు మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కామవరపుకోట మండలం తడికలపూడి నుంచి ఆయిమిల్లికి వెళ్లే రహదారిలో చెట్టు విరిగి రోడ్డ మీద పడడంతో రాకపోకలకు విఘాతం ఏర్పడింది. తడికల పూడి సొసైటీ చైర్మన్ తూతా బాలకృష్ణకుమార్ కార్యకర్తలను సమీకరించి రోడ్డుపై పడిన చెట్టును తొలగించే చర్యలు చేపట్టారు. ఆగిరిపల్లి-నూగొండపల్లి మధ్యగల కంపెనీ వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆగిరిపల్లి నుంచి నూగొండపల్లి, పిన్నమరెడ్డిపల్లి, రాజ వరం, ఎస్‌ఎపేట గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. ఆగిరిపల్లి-తోటపల్లి మధ్య వాగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. పెదవేగి మండలంలో భారీ వర్షాలు కురవడంతో వరదనీరు ముంచెత్తి, పంటపొలాలు ఎర్రనీటితో కనిపించాయి.

వేరుతుండగా 3,700 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతాలకు జలాశయం గేట్ల ద్వారా విడుదల చేసినట్లు ఇరిగేషన్ డీఈ కెనుసీత తెలిపారు. జలాశయం నీటి సామర్థ్యం 83.50 మీటర్లు కాగా శనివారం రాత్రికి 82.65 మీటర్ల నీరు జలాశయంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. జల్లేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తూ వరద నీరంతా జలాశయంలోకి చేరుతోంది. చింతలపూడి సమీపంలోని తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరద వచ్చి చేరుతుంది. శనివారం సాయంత్రం ఆరు గంటలకు ఎగువ నుంచి 1400 వందల క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా దిగువకు రెండువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నీటిమట్టం 348.24 అడుగులు ఉందని దిగువ ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ ఏఈ లాజర్‌బాబు తెలిపారు.

జలాశయాలకు వరదనీరు

జంగారెడ్డిగూడెం/చింతలపూడి: మండలంలోని శ్రీ కొరటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి వరదనీరు చేరుతోంది. శనివారం రాత్రి 9గంటలకు 11,600 క్యూసెక్కుల వరదనీరు జలాశయంలోకి

ఏలూరులో తమ్మిలేరు ఉధృతి

ఏలూరు క్రైం: ఏలూరు నగరంలో శనివారం ఉదయం నుంచి తమ్మిలేరు కొంచెం కొంచెం పెరుగుతూ వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారపుపేట కాజ్‌వేకు ఆనుకుని ప్రవహించడంతో ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇంకో వైపు కొత్త బస్టాండ్ సమీపంలోని లోబ్రిడ్జి (రైలు పట్టాల కింద) రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. వరద ఉధృతి మరింత పెరిగితే ఆదివారం ఉదయానికి మరోసారి శనివారపుపేట కాజ్‌వేపై నీటి ప్రవాహం ప్రవహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నీట మునిగి ఇద్దరు బాలల మృతి

అత్తిలి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అత్తిలి శివారు రామన్నపేటలో సహ్నా మెహతా(2) అనే బాలిక చెరువులో పడి మృతి చెందింది. ఇంటి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం ఉండడంతో బాలికను కేంద్రానికి తల్లి అలవాటు చేసింది. బాలిక తల్లి చేయి కదుపుకుని దానికి వెళ్లగా బాలిక ఎదురుగా ఉన్న చెరువు వద్దకు వెళ్లి పడిపోయింది. ఆ సమయంలో అంగన్ వాడీ కార్యకర్త ఫేస్ యాప్ కోసం పిల్లలను తల్లుల వద్దకు వెళ్లింది. ఆదే సమయంలో సహాయకురాలు పిల్లలకు భోజనం పెడుతోంది. బాలిక ఇంటికి వెళ్లిందని భావించిన తల్లి ఇంటి వద్దకు వెళ్లగా కనిపించలేదు. చెరువు వద్దకు రాగా కొనఊపిరితో ఉన్న బాలికను తణుకు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

రుస్తుంబాదలో...

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాద బల్లకట్టు వద్ద మరో విషాదం జరిగింది. ఆడుకుంటూ మూడేళ్ల బాలుడు నిడదవోలు వంట కాల్వలో పడి మృతి చెందాడు. తల్లి దండ్రులు, స్థానికులు రెండు గంటల పాటు బాలుడు కోసం బల్లకట్టు ప్రాంతంలో వెతికారు. చివరికి కాల్వ గట్టు దగ్గర చూడగా... గుర్రపు డెక్కలో కూరుకుపోయి ఉండటాన్ని గుర్తించారు. బాలుడి తండ్రి ఎస్.భరత్ చిరు వ్యాపారి.

16, 17 తేదీల్లో ఎస్జీఎఫ్ క్రీడా ఎంపికలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అన్ని యాజమాన్యాల హైస్కూళ్లలోని అండర్-14, 17 బాలబాలికలకు పలు విభాగాల్లో జిల్లాస్థాయి ఎంపికల షెడ్యూలును ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.అలీవేలు మంగ శనివారం విడుదల చేశారు. ఈ నెల 16న వెయిట్ లిఫ్టింగ్ అండర్-17 బాల బాలికలకు ఎంపికలు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం, స్విమ్మింగ్ అండర్-14, 17 బాలబాలికలకు ఏలూరు సీతారామ రాజు స్విమ్మింగ్ ఫూల్ విభాగంలో ఎంపిక లు జరుగుతాయి. ఈ నెల 17న కరాటే అండర్-14, 17 బాల బాలికలకు ఎంపికలు ఏలూరు మినీ బైపాస్ రోడ్డు కాస్మో పాలిటన్ క్లబ్‌లో జరుగుతాయి. అండర్-14 ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు 2012 జనవరి 1వ తేదీ తర్వాత, అండర్-17 బాల బాలికలు 2009 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాల న్నారు. క్రీడాకారులు చదువుతున్న స్కూలు/కాలేజీ హెచ్ఎం లేదా ప్రిన్సిపాల్ సంతకంతో కూడిన ఎంట్రీ ఫారంను విధిగా తీసుకురావాలని, లేనట్టయితే ఎంపికల్లో పాల్గొనేందుకు అనుమతించ బోమని స్పష్టం చేశారు. వివరాలకు 90300 94911లో సంప్రదించాలని కోరారు.

16న కబడ్డీ జట్ల ఎంపిక

పెదపాడు/ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరుగనున్న అంతర్ జిల్లాల జూనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొనే బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికను ఈనెల 16వ తేదీన నిర్వహిస్తామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కె.రంగారావు, ప్రెసిడెంట్ ఎం. శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వట్లూరులోని సర్ సీఆర్‌రెడ్డి ఇంజ నీరింగ్ కళాశాలలో ఆరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఏలూరు జిల్లాకు చెంది, 1-1-2006 తరువాత జన్మించిన వారు ఎంపికకు అర్హులన్నారు. 75 కేజీల లోపు బాలురు, 65 కేజీల లోపు బాలికలు ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరు 22 నుంచి 25వ తేదీ వరకు విజయవాడ, గొల్లపూడిలో జరిగే అంతర్ జిల్లాల జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనా లన్నారు. మరిన్ని వివరాలకు 99519 31133, 88856 23693, 99851 47123 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దివ్యాంగుడికి చేయూత

ముదినేపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలపర్రు గ్రామానికి చెందిన దివ్యాంగుడు జుజ్జవరపు సుబ్రహ్మణ్యంకు టీడీపీ నాయకుడు చల్లగుళ్ల ఆదిత్య చౌదరి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన సుబ్రహ్మణ్యం తల్లి ఇటీవల మరణించగా ఆమె దశ దిన కార్యక్రమానికి శనివారం ఆదిత్య నగదు సహాయం చేశారు, సర్పంచ్ గుంటూ రాకేష్ కుమార్ 50 కేజీల బియ్యం అందజేశారు. టీడీపీ నాయకులు వల్లభోతు ప్రసాద్, గన్నమనేని శివ, కోడూరు వీరయ్య, కోడూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా వినాయకుడి ఊరేగింపు

కైకలూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా కైకలూరు కూరగాయలు, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆది వినాయకస్వామి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. శనివారం కైకలూరు పురవీధుల్లో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. కోలాటాలు, డప్పులు, శక్తివేషాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామివారిని ఉప్పుటేరులో నిమజ్జనం చేశారు. కైకలూరు టౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

క్రైమ్ కార్నర్

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి దుర్మరణం

కలిదిండి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరులోకి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. కలిదిండి మండలం చిన తాడినాడ పల్లిపాలెంకు చెందిన కొల్లి వరప్రసాద్ (42) శనివారం ఉదయం ఉప్పుటేరులోకి నాటు పడవపై చేపల వేటకు వెళ్లాడు. చేపల కోసం వల వేయగా చిక్కుకుని రాకపోవటంతో బలవంతంగా వలను లాగుతూ ప్రమాదవశాత్తు ఉప్పుటేరులో మునిగి మృతి చెందాడు. ఆతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే వరప్రసాద్ ఆకస్మాత్తుగా మృతి చెందటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబీకుల శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వరప్రసాద్ (ఫైల్)

అత్యాచార యత్నం.. నిందితుడికి రిమాండ్

మండవల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం లోకుమూడికి చెందిన యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామచంద్రరావు తెలిపారు. కైకలూరు మండలం దానగూడెంకు చెందిన పైడియ్య భరత్ కుమార్ (21) లోకుమూడిలో నివాసముంటున్న ఓ యువతి ఇంటికి ఈ నెల 12న వెళ్లి యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. యువతి కేకలు వేయడంతో తల్లిదండ్రులు రాగా వారిపై దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అత్యాచారయత్నం కేసు నమోదు చేసి నిందితుని అదుపులోకి తీసుకుని కైకలూరు న్యాయస్థానంలో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.